విశిష్ట అతిథులుగా పాల్గొన్న డా. బుచ్చిబాబు పైడిపాటి సుశ్రుతుడు ఎంతో విపులంగా పేర్కొన్న మెడికల్ ఎథిక్స్ గురించి, డా. వి.కె. రాజు సుశ్రుతుడు చేసిన కంటివైద్య పద్దతుల గురించి, డా. శేషుశర్మ సుశ్రుత సంహితలో వాత, పిత్త, కఫ దోష పరిస్థితులను ఎదుర్కోవడానికి సరైన ఆహారం, వ్యాయామం, నిద్ర అలవాట్లు ఎంత ముఖ్యమో వివరించారు.అలాగే డా. పండరి గంటి సుశ్రుతుడు ప్రధానంగా ఆయుర్వేద చికిత్సా విధానం ఎలా పనిచేస్తుందో సుశ్రుత సంహిత గ్రంథంలో పేర్కొన్నారని, అది నేటికీ ఫలవంతమైన చికిత్సేనని వెల్లడించారు. తానా ప్రపంచ సాహిత్య వేదిక సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ పాల్గొన్న అతిథులందరికీ, ఈ కార్యక్రమ విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉత్తర అమెరికా తెలుగు సంఘము

TELUGU ASSOCIATION OF NORTH AMERICA

# VOLLEYBALL tournament

## Aug 22nd, Saturday 2026

**Location :**
240 Chestnut Pkwy,
Indian Trial, NC 28079

**Division 1**

**Division 2**

**Division 3**

SCAN ME FOR REGISTRATION

**TOTAL PRIZE MONEY 3500+**

https://events.tana.org/event/nc-volleyball-2026

**Dr. NAREN KODALI** President | **LAVU SRINIVAS** EVP | **RAVI (NANI) VADLAMUDI** TANA APPALACHIAN RR

**SIVA CHAVA** TANA SPORTS COORDINATOR | **NAGA PANCHUMARTHI** SPECIAL PROJECTS COORDINATOR | **DINESH** APPALACHIAN SPORTS CHAIR

**KIRAN KOTHAPALLI** TEAM SQUARE CHAIR | **TAGORE MALLINENI** FOUNDATION TRUSTEE | **CHANDHU GORREPATI** FOUNDATION TRUSTEE | **MADHURI YELURI** HELATH SERVICES COORDINATOR

# ఆమని కోయిల.. .
# ఎస్. జానకి



***పంచభూతాలనే పరవశింపచేసే గాత్రం ఎస్. జానకి సొంతం... జానకి గానమాధుర్యంలో యావద్భారతం ఆనందడోలికల్లో ఊగింది...***

***తెలుగునాట పుట్టి, చెన్నపట్టణంలో అడుగు పెట్టి-యావత్ భారతాన్నీ తన పాటతో కట్టిపడేశారు జానకి... దక్షిణాది అన్ని రాష్ట్రాలు జానకిని గాన కోకిలగా తమ మదిలో నిలుపుకున్నాయి... ఈనాటికీ జానకి పాటతో పరవశించి పోయేవారు ఎందరో ఉన్నారు....***

***తెలుగునేలను పులకింపచేసిన కోకిలమ్మలు ఎందరు ఉన్నా, వారిలో ఎస్.జానకి బాణీయే వేరు... స్వరాలకు అనుగుణంగా తన స్వరపేటికను మార్చుకోగల శక్తి జానకి సొంతం... బాల్యంలోనే ఆమె గళంలో జాలువారే ఏ పదమైనా రాగయుక్తంగా సాగి మనసుల్ని పులకింప చేస్తూ ఉండేది... అదే ఆమెను చెన్నపట్టణం చేర్చింది... అక్కడే జానకిలోని గాయని వెలుగు చూసింది... అభిమానగణాలను పోగేసుకుంది...***

***ఆ గానకోకిల ఈనెల 11న మనందరినీ వీడి భువి కేగింది. ఆమెకి తానా నివాళులు అర్పిస్తోంది.***

తన కంఠంలో పలకని స్వరం లేదు ఒక్క అప స్వరం తప్ప అనిపించుకొన్న ప్రముఖగాయని ఎస్. జానకి. ఐదు దశాబ్దాలుగా శ్రోతలు ఆమె పాటలతో అత్యంత సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు. పద్నాలుగు భాషల్లో పదివేలుకు పైగా పాటలు పాడిన జానకి 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పాలపట్ల గ్రామంలో పుట్టారు. వాళ్ల నాన్న శిష్ట శ్రీరామమూర్తి ఆయుర్వేద వైద్యం చేసేవారు. ఆరుగురు అక్కచెల్లెళ్లలో నాలుగోవారు జానకి. వాళ్ల కుటుంబం నైజాం రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో కొంత కాలం ఉండి తర్వాత రాజమండ్రి చేరింది. చదువు కోమని బడికి పంపినా జానకికి చదువు మీద ఆసక్తి ఉండేది కాదు. ఎంతసేపూ పాటల మీదే ధ్యాస. అందు వల్ల ఆవిడకు చదువు అబ్బలేదు. పదేళ్ల వయసులో పైడి స్వామి అనే నాదస్వర విద్వాంసుడి దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకోవడానికి చేరారు. స్వరాల నుంచి జానకికి నేర్పడం అనవసరం అనుకోని ఏకంగా ఒకేసారి నగు మోము కనలేని వంటి కీర్తనల నుంచే సంగీత శిక్షణ మొదలు పెట్టారాయన.

జానకి ధ్యాసంతా సినిమా పాటల మీదే ఉండేది. రేడియో ఆమె గురువుని చెప్పాలి. లతా మంగేష్కర్, ఆశా భోంస్లే పాటలు తప్ప మరే పాటలు వినేవారు కాదు. కొంచెం పెరిగి పెద్దయ్యాక రాజమండ్రిలోని క్రాంతి కళామందిర్‌లో సినిమా పాటల కచేరీ చేసేవారు. పెళ్లయి నెల్లూరులో అత్తవారింట్లో అడుగు పెట్టారు జానకి. ఆవిడ మామగారు ఫన్ డాక్టర్ చంద్రశేఖర్. స్టేజ్ మీద రెండే రెండు నిమిషాల్లో వేషాలు మార్చుకొని గాంధీ, నెహ్రూ, జకీర్ హుస్సేన్‌లను అనుకరించేవారు. అయన మేకప్ మార్చుకునే రెండు నిముషాల గ్యాప్‌లో పాటలు పాడేవారు జానకి. అలా మామగారు చంద్ర

శేఖర్, భర్త రాంప్రసాద్ ప్రోత్సహంతో చిత్రరంగంలో అడుగు పెట్టారు జానకి. 1957లో సంగీత దర్శకుడు తాతినేని చలపతిరావు జానకితో ఓ తమిళ చిత్రంలో ఓ విషాద గీతాన్ని తొలిసారిగా పాడించారు. తెలుగులో ఎం.ఎల్.ఏ. చిత్రంలో పెండ్యాల స్వరపరిచిన నీ ఆశ ఆడియాస అనే విషాద గీతాన్ని ఘంటసాలకు సహ గాయనిగా పాడారు. విశేషం ఏమిటంటే వివిధ భాషల్లో జానకి పడిన మొదటి పాటలన్నీ విషాదగీతాలే.

భారతదేశంలోని టాప్ ఫోర్ ఫిమేల్ సింగర్స్‌లో ఒకరిగా గుర్తింపు పొందిన జానకి సినీగాయనిగా తన స్వర జీవితం మొదలైన మొదటి సంవత్సరంలోనే ఆరు భాషల్లో వంద పాటలు పాడారు. ఆ రోజుల్లోనే కాకా ఈనాటికీ అది ఒక రికార్డ్‌గా నిలిచిపోయింది. శాస్త్రీయ సంగీతంలో తనకు థియరీ తెలియదంటూ వినమ్రంగా చెప్పే జానకి తన స్వర జైత్రయాత్రలో సాధించిన విజయాలు అన్యులకు అసాధ్యం. నాలుగు తరాలకు చెందిన కథానాయికలు వారే పాడారేమో అన్నంతగా గొంతు మార్చి పాడడం జానకికి చెల్లు.

జానకి ఆరంభంలోనే పలువురు ప్రఖ్యాత సంగీత దర్శకుల స్వరకల్పనలో పాటలు పాడే అవకాశం సంపాదించారు... ఆమె గళంలోని మాధుర్యం అప్పట్లోనే ఎందరో సంగీత పిపాసుల హృదయాలను పరవశింప చేసింది... పాట ఏదైనా సరే తన మధుర గాత్రంతో సదరు గీతాన్ని అమృతతుల్యం చేయడం జానకమ్మలోని ప్రత్యేకత! ఎందరో కవిరాజులు ఆ రోజుల్లో తమదైన బాణీ



పలికిస్తూ భావకవిత్వం చిలికించారు... అందుకు తగ్గట్టుగా వారి కలం పలికిన పదాలను తన గళంలో నింపుకొని అమృతం కురిపించారు జానకి... ఆ పదాలు నేటికీ మధురం పంచుతూనే సంగీతాభిమానులను ఆకర్షిస్తున్నాయి...

తొలిరోజుల్లో జానకిని ఆనాటి కొందరు స్టార్ హీరోయిన్స్ సెకండ్ గ్రేడ్ సింగర్‌గా గుర్తించారు... అలాంటి వారికి తన గళంతోనే సమాధానం చెప్పిన మధురగాయని జానకి... తాను మాత్రం నాటి వర్ధమాన నాయికలకు సైతం పాడి, వారిని విజయపథంలో పయనింపచేశారు ఈ గానకోకిల... తన గాత్ర మాధుర్యంతో స్వపరభేదం లేకుండా పలు భాషలవారిని పరవశింపచేశారు. ఆమె తెలుగునేలపై జన్మించడం నిజంగా తెలుగువారి అదృష్టం. ఏ భాషలో పాడినా జానకి పాట తేనెలూరిస్తూనే ఉంటుంది. మాతృభాషలో పాడితే ఆ మాధుర్యం మరింత మధురంగా ఉంటుందనడంలో సందేహమేముంది. కోకిల స్వరంతోనే పోటీ పడి పాడగల నేర్పు జానకి గాత్రానికి మాత్రమే అబ్బిన విద్య అనిపిస్తుంది. పలువురు సంగీత దర్శకులు ఆ సత్యం తెలిసినవారు కాబట్టే, కోకిల కువకువలతోనే జానకి ఆలాపనను మేళవించి మధురామృతం పంచిన సందర్భాలున్నాయి. ఈ గీతాలను ఒక్కసారి వింటే చాలు రాతిగుండెల్లో సైతం తేమ ఊరక మానదు.

జానకి గళంలో జాలువారే చిలిపిదనం వింటే మనసు చిందులు వేస్తుంది. ఆ పాటలోని మాటలకు అర్థాలు తెలియని మనుషులు



సైతం జానకి గాత్రమహిమకు సాహో అనవలసిందే... ఆ గానంతో సాగవలసిందే... అలుపు లేకుండా గెలుపు దొరుకు తుందనే నమ్మకంతో చిందేయ వలసిందే!...

నవ్వించడమే కాదు, కరుణ కురిపించడంలోనూ జానకమ్మ గాత్రం భలేగా సాగింది. ఆ సందర్భాల్లో జానకమ్మ గళం చేసిన విన్యాసాలు మన కళ్లను చెమ్మ గిల్లేలా చేస్తాయి. మనసును తడిచేయడమే కాదు, దానికి ఊరట కలిగించడమూ ఆమె గాత్రంలో దాగుందని చెప్పవచ్చు. తన దరికి చేరిన సవాళ్లను ఆనందంగా స్వీకరించి, పౌరాణికాల్లోనూ తనదైన బాణీ పలికిస్తూ గానం చేశారు జానకి. అంతకుముందు ఇతర గాయనీ మణులు ఆలపించిన పాటల్లాంటివే తానూ గానం చేసి తనదైన ముద్రను వేశారు జానకి. ఇక సందర్భాను సారంగా అక్కడా తన గళంలో ఆమె చేసిన విన్యాసాలు భలే గమ్మత్తుగా మనపై మత్తు చల్లుతాయి. పురాణగాథ ల్లోనూ పరవశింప చేసిన జానకి గాత్రం, భక్తి పారవశ్యాన్ని సైతం మనలో నింపేలా పల్లవించింది. జానకి ఆలపించిన పలు పాటల్లోని భక్తిభావం మన మనసులను హత్తుకొని మెత్తగా మనల్ని సైతం పరం ధామునివైపు పరుగులు తీసేలా చేసిన సందర్భా లున్నాయి. కళారాధనలో పరితపించే హృదయాలను ప్రతీసారి పరవశింప చేయడం అంత సులువు కాదు. జానకి గళంలో జాలువారిన ప్రతీ పదం సులువుగా మన మనసులు దోచేస్తూ ఉంటుంది. అదీ ఆ గాత్రంలోని మహత్యం. కళకు తగ్గట్టుగా గళం సాగించి మధురాన్ని మన సొంతం చేస్తుంది.

నర్తనవేళ అందెల రవళికి తగ్గ గానం చేసి పుల కింపచేయడంలో జానకి గాత్రం సాగిన తీరు మనల్ని ఒక పట్టాన వదలదు. ఏ చోటకు వెళ్లినా మనలను వెంటాడుతూనే ఉంటుంది. ఒకసారి కాదు పలుమార్లు ఆ తీయదనం నాట్యానికి అనువుగా పల్లవించి పరవశింప చేసింది. ఆ మధురం నెమలికి నడకలు నేర్పుతుంది – మురళికి అందని పలుకులూ వినిపిస్తుంది.

భావకవుల కవిత్వంలో వెల్లివిరిసిన దేశభక్తి మరింత మధురంగా ఉంటుందంటారు. ఆ మధురానికి జానకమ్మ గళం తోడయితే, ఆ రుచి గురించి వేరే చెప్పాలా!? తీపి మరీ ఎక్కువైనా రుచించదు అంటారు. కానీ, జానకమ్మ గాత్రంలో జాలువారిన దేశభక్తి గీతాలు మనసు కోరుకొనే మధురాన్నే పంచాయి.

పసిపాప బోసినవ్వులోనే దైవమున్నాడని అంటారు వేదాంతులు. ఎలాంటి కల్మషం లేని పసిహృదయాలకు తగ్గ రీతిలోనే పల్లవించి వారి అమాయకత్వాన్ని తన గాత్రంలో పలికించారు జానకి. సదరు పాటలను ఒక్కసారి వింటే చాలు మన మనసుల్లో చిందులేసిన విచారాలు సైతం విహంగంలా ఎగిరిపోతాయి...

రాగంలో అనురాగం చిందిన మనసున మధురాతి మధురం నిండి ఉంటుంది. ఆ సమయంలో ఆ పెదాలు పలికే పదాలు సైతం అమృతమయమై పోతాయి. అలాంటి సందర్భాల్లోనూ జానకి గళం పలు విన్యాసాలు చేస్తూ పండితపామరులను పరవశింప చేసింది.

పదహారేళ్ల పడచు పరువానికి లోకం కొత్తగా కనిపిస్తుంది... మనసు కొత్త దారుల్లో పయనించాలని తపిస్తుంది... తనువు కొత్త రుచులు కోరుకుంటుంది... ఇలాంటి అనుభూతులనన్నిటినీ ఓ పాటలోనే రంగరిస్తే ఆ పాటకు నిత్యనూతనత్వం చేకూరుస్తూ జానకి గానం సాగింది. ఆ పాట విన్న ప్రతీసారి కొత్తగానే ఉండడం ఆ గళంలోని ప్రత్యేకత.

ప్రతి మనిషి జీవితంలో టీనేజ్ ఓ మరపురాని మధురం. ఆ ప్రాయంలో చేసిన చిలిపి చేష్టలు గుర్తుకు వచ్చిన ప్రతీసారి మధురమైన బాధ మన మదిని తడుతూ ఉంటుంది. పదే పదే గుర్తుకు తెచ్చుకొని పులకించే మనసులూ ఉంటాయి. ఆ భావనకు తగ్గ తాళాలు అమరిన వేళ, అందుకు అనుగుణంగా జానకి గళం సాగిన తీరు సైతం పులకింప చేస్తూనే ఉంటుంది. మనసులోని మర్మాలు ఎవరివి వారికే తెలియాలి. కోరుకున్నవారిని కొంగున ముడేసుకోవాలని మదిలో ఆశలు చిందులు వేస్తూంటాయి... కానీ, ఆ అభిలాష ఫలించాలంటే ఏడుకొండలవానికే నివేదించుకోవాలి. వెంకన్నస్వామి కరుణిస్తాడని, కోరిన కోరికలు తీరుస్తాడని తెలుగునేలపై ఎందరికో నమ్మకం. అందుకు తగ్గట్టుగా రూపొందిన సన్నివేశంలో జానకి గళం కాదు ఆమె ఆత్మనే గానం చేసినట్టుగా ఉంటుంది...

పగలే వెన్నెల జగమే ఊయల, నీ లీల పాడేద దేవా, నీలిమేఘాలలో గాలి కెరటాలలో , మనసా తుళ్లి పడకే అతిగా ఆశపడకే, సిరిమల్లె పువ్వా సిరిమల్లె పువ్వా, మనసు పలికే మౌనగీతం నేడే, మళ్లీ మళ్లీ ఇది రానిరోజు... వంటి మెలోడీలే కాదు. సందే పొద్దుల కాడ సంపంగి నవ్వింది తరహా హుషారు గీతాలు కూడా ఆవిడకు కొట్టిన పిండి. ఇక చిన్నారి గొంతుల్ని అనుకరించడంలో జానకిది ప్రత్యేకమైన శైలి. తెలుగు సినిమాల్లో ఈమెలా పసిపిల్లల గొంతుల్ని అనుకరించిన మరో గాయని లేదు. దక్షిణాదిన దిగ్విజయంగా సాగిన జానకి స్వర సమీరం నాలుగుసార్లు ఉత్తమ గాయనిగా జాతీయ పురస్కారాలను మోసుకెళ్లింది. తెలుగింటి నుంచి ఐదు నంది అవార్డులు, నాలుగు తమిళనాడు స్టేట్ అవార్డులు, 12 సార్లు కేరళ పురస్కారాలు, ఒడిసా



ప్రభుత్వం నుంచి సైతం ఓ పురస్కారం.... ఇంకా తమిళనాట కలైమామణి, ఉత్తరాదిన సురసింగర్ గౌరవాలు జానకి కీర్తి కిరీటంలో కలికితురాళ్లు అయ్యాయి.

కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడటమే జానకమ్మకు తెలుసు. ఆమెకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించినప్పుడు, తన పాటకు 'భారతరత్న' ఒక్కటే సరితూగుతుందని తెగేసి చెప్పారు. 'పద్మ' అవార్డునూ తిరస్కరించారు. అలా తన ఆత్మగౌరవాన్ని నిలుపుకున్న ప్రత్యేకమైన వ్యక్తిత్వం మన జానకమ్మ సొంతం. జానకి గాత్ర మహిమకు ఎన్నో అవార్డులూ రివార్డులూ ఆమెను వరించాయి. ఆమె పాటకు ప్రజలే తమ మనసుల్లో పట్టాభిషేకం చేస్తున్నారు. ఇక వేరే అవార్డులూ రివార్డులూ ఎందుకు అంటారు జానకమ్మ. ఆమె తెలుగు వారయినందుకు మనమంతా గర్విద్దాం. ప్రేక్షకాదరణను మించిన అవార్డు లేదని భావించే జానకమ్మ గానం సదా మనకు మధురమే పంచుతుంది. ఆ భావనలోనే జానకమ్మ లేని లోటును మరచిపోదాం...



వంశీ

ప్రయాణ జ్ఞాపకాలు

# పల్ల వెంకన్న



"కడియంలో కొన్ని నర్సరీలకి ఓనరైన ఆ పల్ల వెంకన్న ఆత్మకథ గోదావరి జిల్లా శ్లాంగ్‌లో మీరు రాస్తే బాగుంటుంది. మనదేశంలో అతిపెద్ద నర్సరీ హబ్ ఆ కడియం లోనే ఉంది. చిన్నాపెద్దా నర్సరీలు కల్సి ఐదువేలు పైనే ఉన్నాయి. వాళ్లలో నెంబర్‌వన్ పల్ల వెంకన్న," అన్నారు ఎమెస్కో విజయ్ కుమార్.

ఆ ప్రాంతంవాడ్నే అయినా ఆ వెంకన్నగారి గురించేం తెలీక పోడంతో, "ఏంటండాయన గొప్ప దనం?" అన్నాను.



ఏంటో ఆ విజయ్‌కుమార్‌గారు చెపుతుంటే పెట్రోలు బంకులో పనిచేసి ఇంత గొప్పోడైన ధీరూభాయి అంబానీ గుర్తుకొచ్చాడు. స్వయంకృషితో పైకొచ్చిన మా గోదారి జిల్లా వాళ్లయిన ఆదిత్య శేషారెడ్డీ, విక్టరీ వెంకటరెడ్డీ గుర్తుకొచ్చేరు. ఇంకా చాలామంది గుర్తుకొచ్చేరు.

"మీ ప్రాంతమెళ్లినప్పుడు ఆ ముసలతన్నోసారి కల్సి మాటాడితే ఇంకా బాగా అర్థమవుతాడు. ఇదిగో వాళ్ల ఫోన్ నెంబర్లు," అంటా ఇచ్చేరు విజయ్‌కుమార్.

*

ద్వారపూడి వంతెన మలుపు తిరిగిన మా కారు ఎడంపక్కకి తిరిగింది.

*కొట్టేసిన చెట్టుతోపాటు దాని నీడని కూడా*
*మోసుకుపోతున్నారా లారీలో...*

*మంటకి నాలుకలెన్నో*
*అన్నింటిదీ ఒకే మాట చిటపట...*

*నదులెన్ని తనలో కలిసినా*
*గుణం మార్చుకోలేదు సముద్రం.*

అంటా మూడు హైకూలు చెప్పిన ఆ కొండూరి రామరాజుని మెచ్చుకుంటా, "బాగున్నాయి," అన్నాను.

నేనీ ఏరియాకొస్తే నా కారెక్కేసి తను కొత్తగా రాసిన హైకూలు గురించీ చదివిన పుస్తకాల గురించీ తెగ మాటాడేసేకా సీటు వెనక్కి నడుం వాల్చి నిద్రపోయే ఆ రామరాజు, ఆవేళలా మాటాడుతున్నాడు.

మా కారు కడియం వంతెన మీద కొచ్చిందోలేదో ఆపండాపండంటా అరిచేడు.

ఆపిన డ్రైవరు, "ఎందుకాపమన్నారండీ?" అంటుంటే దారాలకి గుచ్చేసిన మల్లెపూల దండలట్టుకున్న ఆడపిల్లలు కొనుక్కోమంటా తెగరుస్తుంటే అద్దాలు దించేసిన మా కార్నిండా సువాసనే సువాసన.

అవన్నీ ఆ కడియం నర్సరీల్లో పూచిన మల్లెపూలంట. ఒక పిల్ల చేతిలోంచి రెండు దండలు లాగేసుకుని పదినోటిచ్చిన రామరాజుతో ఇంకో ఐదివ్వండంటుందా పిల్ల.

"ఐదుగాదు వందిద్దామనుందిగానీ డబ్బుల్లేవమ్మా," అంటా ఆ పూలనే వాసన చూస్తున్నా రామరాజువేపు చూడకుండానే ముందుకి పోనిచ్చేడు డ్రైవరు.

రకరకాల మలుపులు తిరిగిన కారు నర్సరీల మధ్యలోంచెళ్తుంటే దారికి ఎడాపెడా పూలచెట్లమయం. చూస్తున్న రామరాజు, "ఆహాహా... ఓహోహో ఎంత బాగున్నాయో. కారాపు... కారాపు తమ్ముడూ," అంటా అరిచేటప్పటికి ఆగిపోయిందది.

డోరు తీసుకు దిగిపోతున్న రామరాజు వెనకాలే నేనూ దిగేను.

గులాబీలూ బంతులూ చేమంతులు, మల్లెలూ, మందారాలూ, విరజాజులూ సన్నజాజులూ, కనకాంబరాలూ, పారిజాతాలూ, రాధామనోహరాలూ, రామబాణాలూ, నందివర్ధనం, పొన్నలూ, పున్నాగ, కలువ, తామర ఇంకా ఆంతురియాలూ, ఆర్కిడ్ పూలూ ఆ రంగులమయాన్ని చూసి, "ఆహాహా... ఓహోహో," అంటా అరుస్తుంటే మా దగ్గరకొచ్చిన ఆ మనిషి, "లోపలికొచ్చి చూడండి," అన్నాడు.

థాంక్సంటా నవ్వి అతని వెనకే నడుస్తున్నాం.

"సినిమాల్లో చూస్తున్నట్టుంది," అన్నాడు రామరాజు.

"నూటయాభై సినిమాల్దాకా తీసుంటారండి ఈ ఏరియాలో," అన్నాడా మనిషి.

"ఇలా ఎక్కడిదాకా ఉంటాయి ఈ తోటలు?" అని రామరాజు అడిగితే "వెంకయ్యమ్మపేట, పొట్టిలంక, కడియపు సావారం, వీరవరం, దామిరెడ్డిపల్లి, వేమగిరి దాకా వేల ఎకరాల్లో ఉన్నాయండి నర్సరీలు. ముప్పై, నలభైవేల మంది పనిచేస్తున్నారండి ఈటిల్లో. ఈ వూళ్లల్లో ఆడపిల్లల్ని పెళ్లి చేసుకున్న పొరుగూర్ల కుర్రోళ్లంతా హేపీగా ఇల్లరికం వచ్చేసి ఇక్కడ బతికేస్తున్నారండి... ఇక్కడ మట్టికీ, గాలికీ, మనుషుల పనితనానికీ ఎంత ఎండిపోయిన మొక్కైనా వెంటనే ప్రాణం పోసేసుకుంటదండీ."

లెక్కకి మించి ఉన్న ఆ పూలమొక్కల్నీ, పళ్లమొక్కల్నీ, ఫోలి ఏజ్ మొక్కల్నీ, ఎవిన్యూ మొక్కల్నీ... చూస్తుంటే నిజమే అనిపించింది.

"మేమొస్తున్నట్టు తెల్సుగాబట్టి ఆ పల్ల వెంకన్నగారు పంపించుంటారు నిన్ను."

"భళే కనిపెట్టేసేరే."

"ఇంటిలిజెంట్‌నిగదా మరీ..." అంటా అతని భుజ మ్మీద ఫ్రెండ్షిప్పుతో చెయ్యేసిన రామరాజు, "చాలా మంచి ఇన్‌ఫర్మేషనిస్తున్నావ్‌గానీ అన్నయ్యా..."

"మీకంటే చాలా చిన్నోడ్ని."

"పోన్లే తమ్ముడూ... ఎన్నాళ్లు పట్టిందంటావూ ఈ ఏరియాలో నర్సరీలు డవ్‌లప్ అవ్వడానికి?"

"ఉండడం అయితే వందేళ్లనించున్నాయండి. రావు చిన్నారావుగారని ఆయన మొదలెట్టేరంటండి."

"రావుగోపాలరావుకి బంధువులయ్యుంటారు..."

"ఏమోగానీ, మా వెంకన్నగారు ఈ ఫీల్డ్‌లోకొచ్చేకా మా కడియం పేరు బయటి దేశాల్లోక్కూడా పాకిపోయింది... ఆళ్ల నాన్నగారైన నారయ్యగారు అరెకరం పొలం ఇస్తే దాన్ని నూటయాభై ఎకరం చేసేరండీరు."

"ఏంటీ మొక్కల పెంపకం మీదే?"

"ఆయ్. మా ఎంకన్నగారి వయసిప్పుడు ఎనభై ఆరేళ్లండి. ఇప్పటికీ మొక్కలనీ పూలనీ వదలరండి. ఒకప్పుడు ఎవరికైనా మొక్క కావాలంటే ఇక్కడికొచ్చే వోరండి. మా ఎంకన్నగారు ఆళ్ల దగ్గరికే మొక్కని తీసుకెళ్లే రండి. మా మొక్కలు మరేవో దేశాల కెళ్లిపోతన్నాయండి."



"లెజెండ్ అన్నమాట. ఆయన్నోసారి చూడాలి," అంటుండగా తెల్ల నిక్కరూ చొక్కా, చేతిలో కర్రా పట్టుకున్న ఒక పెద్దాయన్ని సైకిలెనకాల ఎక్కించుకునో మనిషెళ్తుంటే నల్లటి కుక్క ఆ సైకిలు వెనకాలే పరుగెడ్తుంది.

రంగురంగుల పూలమొక్కలు, రకరకాల పళ్లచెట్లు. ఆ సత్యన్నారాయణ నర్సరీ అంతా కలతిప్పుతా తెగ చెప్పుతున్న ఆ మనిషిని, "నీ పేరేంటి తమ్ముడూ!" అనడిగేడు రామరాజు.

"దేనియేలు రామసామి... ఆమధ్య ఇజ్రాయెల్ ఎళ్లొచ్చేను. సొంతూరు కోనసీమలో మలికిపురం."

"వెళ్తే వెళ్లేవుగానీ, నేను దేనియేలు అని పిలుస్తాను."

"మా ఓనర్‌గారు కూడా అలాగే పిలుస్తారు."

"మీ ఓనరెవరు?"

"పల్ల వెంకన్నగారు."

*

అంట్లని పేక్ చేసేవాళ్లు చేస్తుంటే, మొక్కలకి నీళ్లు పోసేవాళ్లు పోస్తున్నారు. ఆ వాతావరణాన్ని పరమ సంబరంగా చూసేస్తున్న రామరాజు, "చెట్టునీడ, ఆకుల్లోంచి చందమామని చూస్తుంది," అన్నాడు.

విన్న నేను, "బాగుంది నీ హైకూ," అన్నాను.

నవ్వేసిన రామరాజు, "ఇది నాదిగాదు గోపరాజు రాధాకృష్ణది," అంటా ఆ తెల్లగులాబీని గిల్లబోతుంటే చూసిన ఆ దేనియేలు పాములా బుసకొడ్తా, "కొయ్యకండి మా ఓనరుగారు చూస్తే... అగ్గయిపోతారు," అన్నాడు.

"ఇంత పెద్దతోటలో ఈ చిన్ని పువ్వు తెంపితే ఆయన కేం తెలుస్తుందయ్యా నీ ఓవరేక్షను గాకపోతేనీ."

"ఇక్కడ ఇరిసే మొగ్గలూ, పూసే పువ్వులూ, కాచే కాయలూ అన్నీ ఆయనకి లెక్కేనండి. కళ్లు మూసుకుని ఎన్ని మొక్కలు తీసేవో అర్జంటుగా కనిపెట్టేస్తారు. ఇంకో విషయం. ఆయన కప్పెట్టాలేగానీ... పొట్లు పోయిన గింజ కూడా మొలిచేద్దండి."

"ఎక్కడాయన?"

"ఏదో మడిలో పువ్వుని పలకరిస్తానో, ఏ మొక్కకో నీళ్లు చిలకిరస్తానో ఉంటారండి... ఎళ్లి చూడండిగానీ పూలు మాత్రం తెంపకండేం," అంటా వార్నింగిచ్చేడు.

ఆ పల్ల వెంకన్నగారి సృష్టి అయిన ఆ నర్సరీలో రకరకాల మలుపులు తిప్పుతుంటే చిక్కటి పంపర పనాస చెట్టు నీడ కింద నిలబడ్డాం. తెల్లబట్టలేసుకుని సైకిలు ముందు దొడ్డిమీద కూర్చున్న ముసలాయన్నెక్కించుకున్నా మనిషి, మమ్మల్ని దాటుకుంటా వెళ్లిపోతుంటే దాని వెనకే పరిగెడ్తుంది నిగనిగలాడిపోతున్న నల్లటి కుక్క.

చూస్తుండగానే ఆ సైకిలు పూలతోట మలుపుల్లో మాయమవగానే మాటలు వినబడ్తున్నాయి.

"ఏరా సత్తేలూ!... ఈ మడిలో పదిమందికదా పని చేస్తంది. మరి ఏడుగురే కనపడ్తన్నారేంట్రా?"

"ఇద్దరు మంచినీళ్ల కెళ్లారండి."

"ఇంకొకడు గుడ్లెట్టడానికెళ్లేడా? పెట్టిన గుడ్లని పొదగడాని కెళ్లేడా? అలా రౌండేసొచ్చేటప్పుడికి ఆళ్లిక్కడ లేపోవాలి నీకుంటదప్పుడు."

*

"ఒళ్లొంచి పనిచేసే మా ఓనరుగారు ఒళ్లొంగనోళ్ల చేతకూడా పని చేయించగలడు. కోపం అందరికీ ముక్కు మీదుంటే ఈయనకి నాలిక మీదుంటదండి.

"ఆమధ్య, మాలో ఒకడైన సత్తేలుగాడ్ని తిట్టడంగాదు చావగొట్టేసేడు. ఆ తర్వాతాడి కూతురుకి గవర్నమెంటా స్పటల్లో డెలివరీ అయితే ఈయనే దగ్గరుండి బోల్డు ఖర్చు పెట్టేరు," అంటా నవ్వేడా డేనియేలు.




ఆడి భుజమ్మీద మళ్లీ చెయ్యేసిన రామరాజు, "దీన్నే కొట్టి పెట్టడమంటారు," అంటా నవ్వేడు.

"ఆయన ముగ్గురు కొడుకులూ వ్యాపారంలో తండ్రికి చేదోడూవాదోడుగా వున్నా ఆయన స్పీడు ఈళ్లందుకోలేరు. ఆ ముసలాయనలాగవుదామని ట్రై చేస్తుంటారుగానీ అబ్బటం లేదాళ్లకి. చూడనట్టుంటాడు గానీ అన్నీ చూస్తానే వుండే మా ఓనర్గారు ఒక విషయా న్నెంత లోతులకెళ్లి చూస్తాడో చూస్తున్న మాకే మతులు పోతుంటాయండి. ఏం చూడనట్టే అటూ ఇటూ కల తిరుగుతున్న ఈ మనిషి ఇయ్యన్నీ ఎప్పుడు చూసేడ్రా బాబూ అనుకుంటా షాకైపోతుంటాం," అంటా ఆ డేనియేలు చెప్పుకుంటాపోతుంటే పనసచెట్టు పక్కనించి బోల్డు పక్షుల గుంపు.

ఆ పక్కకి జూసి కళ్లు మూసుకున్న రామరాజు, "నేలమీద ఎగరలేకపోతుంది పక్షి నీడ," అంటా ఆ గోరా హైకూ చెపుతా నడుస్తుంటే మొక్కల మధ్యలో అక్కడక్కడా ఊరకుక్కలు కనిపిస్తున్నాయి.

అలా చాలాసేపు మమ్మల్ని కలతిప్పినా డేనియేలు, ఆ పల్ల వెంకన్న గురించి ఎన్నెన్ని చెప్పేడో లెక్కెట్టలేదు.

*

అలా మేం కల తిరిగి, తిరిగి ఎంట్రన్స్‌లో వున్న ఆ సత్యనారాయణ నర్సరీ ఆఫీసు దగ్గర కెళ్లేటప్పటికి లెక్కలు రాసుకుంటున్న వెంకన్నగారబ్బాయి సుబ్రమణ్యం మమ్మల్ని చూసి గబగబా దగ్గరకొచ్చి, "అన్నీ బానే చూపిస్తున్నాడా మా డేనియేలుగాడు?" అన్నారు.

"చాలా బాగా. నవ్వుతాలకి చెప్తున్నట్టే మొత్తం మీ నాన్నగారి కేరెక్టరంతా చెప్పేసేడు," అన్నాడు రామరాజు.

"ఇంకా మిమ్మల్నడగాల్సింది వుంది. చూస్తుంటే మీరేదో పన్లో ఉన్నట్టున్నారు," అన్నాను.

నవ్వేసినా సుబ్రమణ్యంగారు, "ఈ పని రేపన్నా చేసుకుంటాను. కానీ, రేపు మీరుండరు గదా... అడగండి," అంటా లేచి ఆ నర్సరీలో ఇంకోవేపు నడుస్తుంటే అతన్నే ఫాలో అవుతున్నాం. చుట్టూరా గ్రీన్ హౌస్‌లూ, పాలీ హౌస్‌లలో, వేరే దేశాల్నించి తెచ్చి ఇక్కడ పెంచుతున్న నాజూకు మొక్కలు చూస్తుంటే తెగ ముచ్చటే

యడంతో  ఇంకోసారా పల్లెంకన్నని మెచ్చుకోకుండా ఉండలేకపోయిన నేను, "యేంటండీ మీ ఫాదర్ బేక్ గ్రౌండు?" అన్నాను.

"పదిమంది సంతానంలో మా నాన్న లాస్టండి. పుట్టిన రెండో ఏడే ఈయనకి జబ్బు చేసింది. అది చూసి బెంగెట్టుకున్న ఈళ్లమ్మగారు కాలం చేసేసేరు. బతుకుతాడో, బతకడో... అనుకునే టైములో ఈళ్ల పెద్దమ్మ ఈ సంటికుర్రోడ్ని కంటికి రెప్పలాగ జూసుకుంటా కాపాడి వైద్యం చేయించిందండి. నాలుగేళ్లపాటు మంచం మీదే వుండి ఆ తర్వాత ఏదోలాగ లేచి కూర్చున్నాడండి."

సైలెంట్‌గా వింటున్నాం.

"ఐదుదాకా చదివేడండి. బళ్లోకెళ్లేటప్పుడు బోల్డంత మంది ఫ్రెండ్సు. గోళీకాయలాడ్డం అంటే మహా సరదా. గురి చూసి కొడితే అవతలికాయ పేలిపోవాల్సిందే. రోజూ వచ్చే గోళీకాయల్తో పిర్రల దగ్గర చిరిగిన నల్లనిక్కరు జేబు తెగ నిండిపోయేదండి."

"లక్ష్యాన్ని ఛేదించడం అప్పట్నుంచే అలవాటయ్యిందన్న మాట," అంటున్నా రామరాజు మాటేం వినకుండా, "చిన్నప్పట్నుంచీ... ఏదో పని చెయ్యాలన్న ఆరాటం బోల్డంతండి," అన్నాడు.

'అలాగా!' అన్నట్టు చూస్తున్నాను.

"బసవరాజు అని టైలరుండేవోడండి. అతని దగ్గర కాజాలు కుట్టడం, బొత్తాలెయ్యడం నేర్చుకున్నాడుగానీ, మా తాతగారికిష్టం లేకపోయేటప్పటికి దాన్నొదిలేసేడండి.

"ఆయన గొప్పతనం మొక్క వేరులాగ పైకి కనపడదండి. లోపలుంటదండి. అదే లేకపోతే ఇంత వుండేదాండి ఇక్కడ? ఎక్కడికెళ్లినా నా నర్సరీ నా తోట అంటా తాపత్రయపడిపోతా సాయంకాలానికల్లా తిరిగొచ్చి ఆ శృతి కుక్కతోపాటు మొత్తం కలతిరిగితేగానీ స్థిమితపడని మనిషండి..."

"పెంచిన ఆ పెద్దమ్మగారి పేరేంటీ?"

"వీరయ్యమ్మ. ఆవిడంటే భళే ఇష్టం. అందుకే మా అక్కకి వీరావతి అని పేరు పెట్టేడండి. మా అక్కన్నా ఆయనకి చాలా ఇష్టం. దానెనకాల చిన్న ష్టోరీ కూడా వుందండోయ్."



"ఏంటండీ?"

"ఓసారీయన మొక్కల పనిమీద  వరంగల్ వెళ్లారండి. బస్సు దిగేకా ఆటో ఎక్కి ఈ చివర కూర్చున్నారంట. ఎవరో వచ్చి లోపలికి జరగమంటే ఈయన జరగను అన్నాడంట. ఈలోగా వచ్చిన డ్రైవరు ఈయన్ని లోపలికంటా తోసేసి ఆ మనిషిని కూర్చోమన్నాడు. ఇంతలో బాగా వచ్చేసిన జనాల్ని మొత్తం కూరేసేకా స్టార్ట్ చేసుకుని స్పీడుగా వెళ్తుంటే ఎదురొచ్చిన లారీ గుద్దేసింది. డ్రైవరుతోపాటు కూరేసిన జనాలంతా చచ్చిపోయేరుగానీ మూలెక్కడో ఇరుక్కుపోయిన ఈయన బతికిపోయేడు. సరిగ్గా అదే టైముకి ఇక్కడ మా అక్క వీరావతి పుట్టింది. అదండి ఈయనగారి సెంటిమెంటు."

"మృత్యుంజయుడన్నమాట," అన్న రామరాజు మాటకి పల్చగా నవ్విన సుబ్రమణ్యంగారు, "ఇండియా అంతా ఈయన మొక్కలు పూలు పుయ్యాలనీ కాయలు కాయాలనీ దేవుడు రాసిపెడితే ఇలాగే జరుగుద్ది గదాండి మరి!" అన్నాడు.

"అన్నట్టు మీరెంతమంది పిల్లలు?"

"మా అక్క వీరావతి తర్వాత మగోళ్లం ముగ్గురం," అంటా తిరిగి ఆఫీసు దగ్గరకొచ్చేటప్పటికి ఇందాక తెల్లనిక్కరూ చొక్కాతో చేతిలో కఱ్ఱట్టుకుని సైకిల్ ముందు కూర్చునెళ్లిన ఆ ముసలాయన కుర్చీలో కూర్చుని అన్నం తింటున్నాడు.

ఆయనేనంట పల్ల వెంకన్న.

"నేనిందాకే పసిగట్టేసేను," అన్నాడు రామరాజు.

తింటా కంచంలో వున్న మాంసం కూరంతా ఆ నల్లకుక్క సీవండి పళ్లెంలో వేస్తా, "తిను, తినమ్మా శృతీ," అంటుంటే చాలా ఇష్టంగా తినేస్తుందది.

మమ్మల్ని చూసిన వెంకన్న ఇష్టంగా నవ్వుతా, "రండి బాబూ రండి... కూర్చోండి. మావోళ్లంతా బానే చూపించే రాండీ?" అంటున్నారు.

తినడం అయ్యేకా, "ఇయ్యాళ తిండికి లేటయ్యింది. ఓ పావుగంట ఓపికపడతానంటే, చిన్న లెక్కల పని చూసు కుని మీతో కూకుండిపోతాను. ఆ తర్వాత మనిష్టం," అన్నారు.

సరే అంటా ముందుకెళ్లి విరగ్గాసిన ఆ జామిచెట్టు దగ్గరకొచ్చేటప్పటికి ఇంకోపక్కనించొస్తా ఆగిన డేనియేలు, "ఇయాల్టి లెక్కలు చూసుకుంటున్నారు. తేలాలంటే ఓ గంటడతది," అన్నాడు.

ఔనా? అన్నట్టు నవ్వేడు రామరాజు.

"ఆ కొడుకులు ముగ్గురూ ఏరోజు లెక్క ఆరోజు వివరంగా చెప్పేసెయ్యాలీయనకి. అందులో చండ శాసనుడండీ ఎంకన్నగారు."

"ఇంకా ఉమ్మడి కుటుంబమేనా ఈళ్లదీ?"

"పిల్లలందరికీ పంచి ఇచ్చేసేరండి. అయినా, ఎవరూ లెక్క తప్పకూడదండి. ఎవరెందుకు ఖర్చుపెట్టిందీ అణాపైసల్తో జమాఖర్చు లేకపోతే ఒప్పుకోరండి. కాసేపలా కూర్చోండి."

కొడుకుల్తో లెక్కలయిపోయేకా ఆ నల్లకుక్క తలమీద దువ్వుతా కూలీల్తో మాటాడ్తున్న వెంకన్నగారు, "డబ్బులు చెట్లకి కాస్తన్నాయ్యేంట్రా చంటబ్బా?" అంటా ఆళ్ల లెక్కలు కూడా చూసేకా మమ్మల్ని రమ్మని కబురు చేస్తే వెళ్లేం.

నవ్వుతా మాకేసి చూసినా పల్ల వెంకన్న, "పని గట్టుకుని అంత దూరంనించొస్తే ఈడేంట్రా పెద్ద పుడింగి లాగ అనుకుంటున్నారాండీ?" అన్నాడు.

లేదన్నట్టు నవ్వేను.

"నా గురించీపాటికి మొత్తం తెల్సిపోయుంటది. నేను ముందే పురమాయించేన్లే మావోళ్లని," అనా వెంకన్న గారంటుంటే అందుకున్న రామరాజు, "మొక్కల్తోపాటు కుక్కలు కూడా బానే ఉన్నాయండిక్కడ. కారణమేంటం టారూ?" అన్నాడు.

ప్రేమగా ఆ నల్లకుక్క తలమీద రాస్తున్న వెంకన్న, "బానే అడిగేరు. చెప్పమంటారా?... మొక్కకీ కుక్కకీ ఉన్న విశ్వాసం మనిషికుండదు. అస్తమానూ అదే చెప్తుంటాను మా పిల్లలకి. ఇక్కడేగాదు మా ప్రతి నర్సరీ లోనూ బానే తిరుగుతాంటాయి కుక్కలు," అంటా నవ్వేరు.



యిష్టంగా ఆయన్ని జేర్చి కూర్చున్న ఆ నల్లకుక్కనే చూస్తున్న రామరాజు, "ఇది మీ పెంపుడు కుక్కాండీ?" అన్నాడు.

అవునన్నట్టు నవ్వేసిన వెంకన్న, "పదేళ్లనించి నన్ను అంటిపెట్టుకునున్న దీనికి నేనంటే యెంత ప్రాణమో ఇదంటే నాకూ అంతే ప్రాణం. అన్నట్టు దీని పేరేంటో తెల్సా... శృతి," అంటుంటే సైలెంట్‌గా వింటున్నాను.

"నాలుగురోజుల క్రితం నాలుగు పిల్లల్ని కన్న ఇది, ఈ టైములో కూడా ఆటినెక్కడో వదిలేసి, నన్నే అంటి పెట్టుకుని నా కూడా... కూడా తిరుగుతుంటే ఇంకేమను కోవాలండి బాబూ ఈ బంధాన్ని," అంటుంటే ఆ ఎనభై ఆరేళ్ల ముసలాయన కళ్లల్లో తడి. తర్వాత కన్నీళ్లై కారుతుంటే చూసిన ఆ శృతికుక్క అతని చీలమండల దగ్గర నాకుతుంది.

చూస్తున్న మేం అలాగుండిపోయేం.

*

ఇంతకుముందెప్పుడూ వినని వింత వింత వార్తలు గుండెలదిరేలా వినిపిస్తున్నాయి. ఏ మనిషి నోరు విప్పినా, ఏ టీవీ ఏ సెల్‌ఫోన్లో చూసినా, ఏ పేపర్ తిరగేసినా కళ్లకి కలకొచ్చేలాంటి వార్తలు.

రాజమండ్రీలో యంగ్ లాయరైన ఆ టెన్నిస్ మూర్తి ఎప్పట్నుంచో నాకు మిత్రుడే కాదు పల్ల వెంకన్నగారికి బంధువు కూడా.

చంటిపిల్లోడు మెత్తటి కార్పెట్ మీద అడుగులేస్తా నడుస్తున్నట్టు ఆగాగి మృదువుగా మాటాడే మూర్తిగారు ఆవేళ పొద్దుట ఫోన్ చేసేరు నాకు.

ఆగస్ట్ 28వ తేదీనాడు కోవిడ్ వచ్చిన పల్ల వెంకన్న గార్ని రాజమండ్రీ డెల్టా హాస్పిటల్లో జాయిన్ చేసేరు.

ఒకరోజుగాదు రెండు రోజులుగాదు పదిహేను రోజులైపోయింది. రోజూ ఠంచనుగా నర్సరీకొచ్చేసే తన యజమాని ఇన్ని రోజుల్నుంచి రావడం లేదేంటి అనేసి బెంగెట్టేసుకున్న ఆ శృతికుక్క వెంకన్నగారి ఇంటి దగ్గర్నుంచొస్తున్న అన్నం ముట్టుకోటంలేదు.

తన యజమాని, తన ఆఖరి ప్రాణం అయిన ఆ యజమాని కోసం చూసి చూసి ఎప్పుడూలేంది కిలో



మీటర్ దూరంలో వున్న ఆ యజమాని ఇంటికెళ్లి వెతికుతుంటే కనపడలేదు.

ఇల్లంతా తిరుగుతా తెగవెతికింది.

లేదు.

ఎక్కడికెళ్లిపోయేడు. ఏమయ్యిందతనికి? మూలుగుతా కుంటి నడకతో తిరిగి నర్సరీలోకొచ్చేసింది.

అదలాగెళ్లిన మూడోరోజు పొద్దుట 10.47 నిమిషాలకి హాస్పిటల్లో చనిపోయిన వెంకన్నగారి శవాన్ని ఆయన కిష్టమైన ఆ నర్సరీలోకి 12.30కి తీసుకొచ్చేరు.

పరుగెట్టుకుంటా వచ్చిన ఆ శృతికుక్క యజమాని శవాన్ని చూసింది... రెప్పార్పడం మానేసి అలా చూస్తానే వుండిపోయింది.

ఇంతలో ఏడుస్తున్న దాని పిల్లలకి కడుపునిండా పాలిస్తుంటే తాగుతానే నిద్రపోయినియ్యా పిల్లలు. వాటి తల్లి అయిన ఆ నల్లకుక్క వాటితోపాటు నిద్రపోయింది. కాసేపున్నాకా పిల్లలు లేచినియ్యిగానీ ఆ శృతికుక్క మాత్రం లేవలేదు.

పల్ల వెంకన్నకి ప్రాణమైన ఆ శృతికుక్క అలా ప్రాణాలొదిలేసింది.

అదంతా విన్న నాకు గోరా హైకూ గుర్తుకొచ్చింది.

మరణం
అనంత వాయువుల
ఆహ్వానం.

కథ

* కె.వి. మన్ ప్రీతమ్

# నూరేళ్లు మోసే తల్లి

ఎప్పటిలాగే ఇంకాసేపట్లో నేను సూర్యుడి దిక్కు తిరగ బోతున్నాను. అయినా ఆ వెలుతురుతో సంబంధం లేదనుకుంటూ లైట్లు వేసుకొని మరీ ఓ ప్రొక్లీనర్ నా మీదికొచ్చి ఆగింది. ఈమధ్య అంతే ఓ కోడికూతతో కాదూ వాహనాల మోతతో రోజు మొదలవుతుంది. అయినా నాకు తెల్లవారడం రాత్రవ్వడం అనేముంది... తిరుగడం తప్ప! నవ్వుకున్నాను.





***1 ఏప్రిల్ 1996న జగిత్యాలలో పుట్టి పెరిగిన కె.వి. మన్‌ప్రీతమ్ బీటెక్ చదివి, హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, తండ్రి కె.వి. నరేందర్ వారసత్వాన్ని అందిపుచ్చుకుని కథలు రాస్తున్నారు. 18 కథలు రాసారు. పోటీల్లో బహుమతులు గెల్చుకున్నారు. వివిధ కథాసిరీస్‌లలో వీరి కథలు వెలువడ్డాయి. కథలు కొత్తగా రాయాలనే తపనతో రాస్తున్న యువ కథాకెరటం.***

శీతాకాలం మంచు పడుతుంది, నాపై పొర అంతా తడి తడిగా మారిపోయింది. పెరిగిన మొక్కల్లో నాకు మంచి, పిచ్చి అనే తేడా ఉండదు గనుక అన్నిటికీ సమానంగా సారాన్ని అందిస్తున్నాను. అలా పాలుతాగే బిడ్డల్లాగా సారాన్ని పీలుస్తున్నాయే లేదో ప్రొక్లీనర్ తొండంతో మొక్కలను పీకి అవతల పారేసింది. కోపం దుఃఖం ఏమీలేనట్టు అలవాటైన పద్ధతిగా మౌనంగా తిరుగుతూనే ఉన్నాను.

'గమ్యం తెలీని మనుషులు...రోడ్లు వేసుకుంటు న్నారు' అని మొన్నే ఇక్కడి చెట్లు ముసిముసిగా నవ్వు కుంటుంటే, వాటిని నరికేసి మరీ నా ముందు వరకు దారి పొడిగించారు. ఆ దారి మీది నుండి రాజేశం గౌడ్ బండి మీద కల్లు తీయడానికి పోతున్నాడు, ఒక పద్యం పాడుతూ...

'నిజము మీద భూమి నిలబడి యుండును' అని. అది విని 'భూమి ఫక్కున నవ్వు' అని నా నవ్వును ఇప్పుడు ఎవరు కనిపెట్టారు అనుకుంటూ నవ్వాను.

అవును

నేను భూమిని...

భ్రమణ పరిభ్రమణలతో సృష్టికి నిరంతర చలన శీలిని...

సకల చరాచర ప్రాణకోటిని పదిలంగా ఒడిసి పట్టుకున్న పుడమితల్లిని...

పంచభూతాల్లో ఒకటిగా, ప్రపంచపు వాకిలి మీద ప్రాణవాయువునై పల్లవించే నేలమ్మని...

అలానీ మొత్తం భూమినో, మొత్తం పుడమినో నేలనో కాదు, మనుషుల లెక్క ప్రకారం చెప్పాలంటే ఓ ఖండంలోని దేశంగా, ఆ దేశంలో ఓ రాష్ట్రంగా, దాంట్లో కొత్తగా ఏర్పడ్డ జిల్లా కేంద్రానికి తూర్పు చివరున్న రెండు ఎకరాల జాగని నేను... సర్వే నెం.336 ప్రకారం శ్రీ కందుర్తి మల్లేశం జాగిర్ని నేను.

నాకున్న గురుత్వాకర్షణ శక్తితో ఎన్నో జీవుల పాదాలను లాక్కున్నట్టే మనిషి పాదాలను లాక్కుంటూ అడుగులు వేయించగలిగాను, కానీ ఇప్పుడు వాళ్లను 'నడిపించే'ది మాత్రం వేరు. వాళ్ల కాళ్ల కింద ఉన్నానని నన్ను 'ఫీట్ల' కొద్దీ లెక్కలేసి నన్ను చూసే చూపులు వేరు. ఆ ఆశ చావని చూపులు నన్ను ఇంకా తవ్వుతూనే ఉంటాయి.

కానీ మనుషులు వాళ్లది వాళ్లు కదా లోతుగా 'తవ్వుకోవాల్సింది' అనే ఆలోచనలో పూర్తిగా పడక ముందే, పీకడం అయిపోయి రెస్ట్ తీస్కున్న ప్రొక్లీనర్ తవ్వడం మొదలెట్టింది. రాజేశం గౌడ్ రోడ్డు దాటేసాడు, పాటాగిపోయింది. ప్రొక్లీనర్ సౌండ్ మొదలైంది.

ప్రొక్లీనర్ వచ్చిన దారిలోనే ఒక ట్రాక్టర్ కూడా వచ్చింది. వెనుక భాగాన్ని మెల్లగా లేపి ఓ మూడు వందల ఇటుకల్ని నా పై గుమ్మరించింది. ఎర్రగా లేసిన దుమ్ము గాల్లో పూర్తిగా కలవకముందే ట్రాక్టర్ వెళ్లిపో యింది. వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ట్రాక్టర్ టైర్ల అచ్చుల్లో పెద్ద తేడా ఏమీలేదు, ఇటుక 'లైట్ వెయిటే'. కొత్త ప్రాంతాన్ని గమనిస్తున్న ఇటుకలు మెల్లిమెల్లిగా గుసగుస లాడడం మొదలెట్టాయి,

"ఎక్కడున్నామే...?"

"ఎక్కడికి తీసుకొచ్చారు మనల్ని?" ఇటుకల గుంపులో నుండి మాటలు.

"ఏమోగానీ, రోడ్డు మీది ప్రతి గుంతకి ట్రాక్టర్ ఎగిరిపడడంతో నడ్డి ఇరిగినట్టైంది. ఇలా ఒకేసారి కింద పడేయడం కాస్త బెటర్‌గా ఉంది." మరో ఇటుక.

"సర్లే, ఈ ప్రదేశం చూస్తుంటే ఏదో కట్టడానికి సిద్ధంగానే ఉంది, ఇక నుండి ఇదే మనం ఉండే చోటు అనుకుంటా, అదే మనం ధృడంగా ఏకమై మనుషులు నివసించడానికి మారాల్సిన సమయం అనుకుంటా," అని ఓ ఇటుక.

"అదిగో మెల్లిమెల్లిగా సూర్యుడు వస్తున్నాడు, ఇక్కడెక్కడైనా ఏదైన బోర్డులు కనిపిస్తున్నాయో చూడండే, ఎక్కడున్నామో తెలుస్తది," మరో ఇటుక.

"తెల్సుకొని మాత్రం ఏం చేద్దామని, మనతో ఎలాంటి మనుషులు ఉంటారో కదా తెలియాల్సింది"

"ఏ ఊరైనా మనుషులంతా ఒకటే కదనే, వాళ్లను కూడా తెల్సుకొని మాత్రం ఏం చేద్దామనీ," గుంపులోంచి మరో ఇటుక.

అలా మాట్లాడుకుంటూనే చుట్టూ చూస్తున్నారు.

నాపై పీకేసిన గడ్డి, అక్కడక్కడ పడేసినట్టుగా ఉన్న పెద్ద బండలు, చిన్న కంకరరాళ్లు, గాలికి ఎగురొచ్చి పడిన ప్లాస్టిక్ కవర్లు చిత్తు కాగితాలు, రాత్రంతా ఉండి వెళ్లిపోయిన గొర్రె మంద ఇడ్సిన గొద్దెలు, రోడ్డుకు నాకు మధ్యలో ఉన్న కరెంటు స్తంభం దగ్గర నిల్చొని ప్రొక్లినర్‌ని చూస్తు అరుస్తున్న కుక్కలు, పడేసున్న ఇసుక కుప్పలు, సిమెంట్ బస్తాలు... ఇలా ఎండ పూర్తిగా నామీద పడ్డప్పుడు ఇటుకలకి చిత్తడిగా కనిపించిన దృశ్యాలివి. ఇటుకలు అవన్ని చూసి గుసగుస నుండి గోల చేయడం మొదలెట్టాయి. వాళ్ల మాటలు పూర్తిగా వినేలోపే నాలో ఏదో అవస్థ, బలాన్ని కూడదీసుకొని ప్రయత్నిస్తున్నా కూడా ఎన్నో ఏండ్ల కింద గర్భంలోకి దూరిన ప్లాస్టిక్ ఇప్పటికీ అరుగక తోడుగా ఇంకా జమ అయ్యాయని సతవతమవుతున్నాను.

నాలోని అసహనాన్ని గమనించిన ఇటుకలు,

"ఎక్కడికి వచ్చి పడ్డామో తెలీక కంగారుపడ్తుంటే, నువ్వేంటి చిరాకు పడుతున్నట్టుగా ఉన్నావ్ ? కొండలని, బండలని, కండలు బిలిసిన కర్క కఠోర మనుషుల్ని భరించిన దానివి, మేమో బరువా? మాదో గోలా?" ఇటుకల గుంపులోంచి ఒక ఇటుక.

"చిరాకు మీవల్ల కాదులే. అయినా మనుషుల్లా ఆ మాటలేంటి?! నా మట్టితో తయారై, నామీదికే లేస్తున్నారు..." నేను.

"అబ్బో... నువ్వు ఇచ్చిన మట్టితోనే తయారై ఎదిగాంలే గానీ ఇక నుండి నీకంటూ ఓ గుర్తింపు వచ్చేది మాత్రం మా వల్లే కదా, అది గుర్తుపెట్టుకో," ఒక ఇటుక.

"గుర్తింపా? ఎవరికి కావాలి? దానికోసం పాకులాడేది మనుషులు, నేను కాదు. అయినా మీ వల్ల నాకు గుర్తింపేంటో??"

"మమ్మల్ని ఎలా పేర్చుకుంటూపోతే అలా! గోడలుగా నీ సుట్టూ చేరి నిన్ను ముక్కలుగా విడగొడ్తే నువ్వో రియల్ ఎస్టేట్ వెంచరువి, మేము కాస్త దగ్గరగా చేరి ఏకమై గోడలుగా లేస్తే ఒక ఇల్లువి లేక ఆఫీసువి, మనుషులు కొట్టుకొని కట్టుకున్న మా లోపల ప్రార్థనలు వినబడితే నువ్వో మతపరమైన ఆలయంవి, ఆర్తనాదాలు విన్పిస్తే స్మశానంవి. మమ్మల్ని నమ్ముకుని మా లోపల నుండి ఏదైనా అమ్ముకుంటే నువ్వో దుకాణంవి, డాక్టర్లు మకాం వేస్తే దవాఖానవి. తిండి పెడ్తే హోటలో రెస్టారెంటో, తాగుడు పెడ్తే వైన్సో బారో... ఇలా చెప్పుకుంటూ పోతే అబ్బో చాలానే ఉన్నాయి. సో... నేలగా నువ్వు ఎలా ఉన్నా, నీ బతుకంతా మేము కట్టడాలుగా ఎలా లేస్తే అలా ఉంటది." ఇటుకలు గర్వంగా.

"ఓస్ని... మనుషుల చేత తయారవుతారని తెలుసు కానీ మరి మనుషుల్లా తయారవుతున్నారని ఇప్పుడిప్పుడే తెలుస్తుంది. నా నుండి వేసిన స్థంభాలకి అంటుకొని బ్రతికే నువ్వు, నా పైనే పెత్తనం చూపిద్దామనుకుంటున్నావా ? నువ్వు ఎంత ఎత్తులో ఉన్నా కూడా నేను ఏ కొంచెం కదిలినా నీ ఐక్యతలోని గట్టితనమంతా పోయి నాపైనే రాలి పడతావు, మళ్లీ మట్టై నాలోనే కలిసిపోతావ్ గుర్తుంచుకో," నేను.

కోపంతోనో లేక పడిన మంచు వల్లో ఇటుకలు ఇంకా ఎరుపెక్కాయి. కానీ కొన్ని ఇటుకలు,

"హిహ్హిహీ...అది కూడా మాకు మంచిదే. ఈ మధ్య ఓ ఆలయం కూలితే, ఇటుకలను మహా ప్రసాదంగా పట్టుకెళ్లారు. బ్రిడ్జ్ కూలితే, గట్టి ఇటుక అని రాత్రికి రాత్రి మాయం చేసారు. ఇల్లు కూలితే ఆన్‌లైన్‌లో సెకండ్ హ్యాండ్ అని తెలీకుండా ఇటుకలను అమ్మేస్తున్నారు. కూలినా కూడా మాకు ఉన్న గుర్తింపు వేరులే," నవ్వుతూ చెప్పాయి.

"అయినా జీవులపైన, ముఖ్యంగా మనుషులపైన చూపించాల్సిన కోపమంతా మనమీద చూపిస్తుంది చూడు," ఇటుకలు తమలోతాము గుసగుసగా.

"మీరు కూడా నా బిడ్డల్లాంటోల్లే, అందుకే ముందుగా హెచ్చరిస్తుంటాను. నిజానికి నా కోపాన్ని ఎవరు తట్టుకోగలరు?" నిదానంగా నవ్వాను.

కాసేపు ఏ సంభాషణ జరగలేదు. నిశ్శబ్దంలోనే అదో గంభీరత్వం కలిసిపోయి కాసేపు గాలి హోరు మంది. ప్రోక్లీనర్ తన పని తాను చేసుకుంటూ బానే తవ్వింది, కాసేపటికి కూలీలు కూడా రావడంతో చిందర వందరగా పడ్డ ఇటుకలని ఒక వరుసలో పెడుతున్నారు. వాళ్లు అలా నిశ్శబ్దంగా ఉండడం నాకే నచ్చట్లేదు, అందుకే ఓ మాట కలిపాను,

"మీరంతా ఎక్కడి నుంచి వచ్చారు?"

"మేమంతా పక్క జిల్లాలో తయారై వచ్చాం. కానీ మాలో కొంతమంది పాలపుంత నుండి ఊడిపడ్డ వారు కూడా ఉన్నారు తెలుసా...",

"పాలపుంతా ?! ",

"అవును. ఎన్నో ఏండ్ల క్రితం నక్షత్రాల ధూళితో ఏర్పడి ఒక ఉల్క కక్ష్యలోకి చేరి భూమ్మీదకు వచ్చి పడింది. అది కూడా ఉప్పర్లకేసరం అడవిలో పడి మంటలు లేపింది. తర్వాత మట్టిలో కలిసిపోయింది. కొన్ని సంవత్సరాలకి ఓపెన్ కాస్ట్ మైన్లు కోసం అక్కడ తవ్వడం మొదలెట్టాకా మట్టి దిబ్బలపై మా ఇటుక బట్టీలోల్ల కన్ను పడి ఓ రాత్రి ట్రాక్టర్లో ఎత్తుకొచ్చేసారు. అప్పటికే మట్టిగా మాలో కలిసిపోయిన ఆ అంతరిక్షం ధూళితో తయారుచేయబడ్డ ఇటుకగా మాకున్న ధృడత్వం కాస్త వేరు. సిమెంట్ ఇటుక, జేబీసీ ఇటుక వద్దనుకొని మేమే కావాలంటూ నీ జాగిర్దారు (ల్యాండ్ ఓనర్) తొందరపెద్తే, నాగ్‌పూర్ పోవాల్సిన మేము ఇదిగో ఇటు జగిత్యాలకి ట్రాక్టర్ మళ్లించాడు. బియ్యానికి ఉన్నట్టే మా ఇటుకలకు కూడా తయారుచేసినోడిది వాడుకునేటోడి పేర్లుంటాయి తెలుసా," చివరి వాక్యాలు ముసిముసిగా నవ్వుతూ చెప్పాయి.

"ఓహో... గొప్ప గుణాలున్నా అడవి నేల బిడ్డలా మీరంతా! మీలో అంత రిక్షం ముఠాకూడా ఉందన్నమాట. నాకో విషయం చెప్పండి, అంతరిక్షంలో నన్ను దూరం నుంచి చూస్తే నేను ఎలా ఉంటాను?" కాస్త కుతుహలంతో అడిగా.

అంతరిక్షపు ధూళి కలిసిన ఓ ఇటుక, "అదిగో...నీ మీద పడున్న మూడు చిన్నా పెద్దా గుండ్రటి బండ లున్నాయి చూడూ, దాంట్లో పెద్దగా కనబడేది సూర్యుడు, దాని పక్కన కాస్త చిన్నగున్న బండ షుక్రుడు, దాని పక్కనున్న అతి చిన్న బండ బుధుడు," అంది.

"ఇంతకి నేనెక్కడా ?"

"అదిగో ఆ బండల ముందున్న ఓ ఇసుక రేణువు నువ్వు" మహ్హట్టహాసంగా నువ్వుతూ, "అనుకోకుండా కక్ష్యలోకి వచ్చాక కనబడ్డావుగానీ ఉల్కలో భాగమై తిరుగుతున్నప్పుడు అసలు కనిపించలేదు నువ్వు," అంతరిక్షం ధూళి కలిసిన ఇటుక.

ఆ మాటకి నేను ఏం మాట్లాడలేదు, కానీ ఇదే విషయం మనుషులకు తెలుసా అనే ఆలోచనతో నవ్వొచ్చి ఊరుకున్నాను.

"మాకో విషయం చెప్పు, అప్పుడప్పుడు ఆకాశంలో కన్పించే చంద్రుడ్ని చూసి కాస్త ఈర్ష పడ్తావ్ కదా? ఎందుకంటే నీ మీదున్న మనుషులు నీకంటే దూరంగా ఉన్న ఆ చంద్రున్నే చాలా ఇష్టపడ్తారటా! అయినా ఏం ఫీల్ అవ్వకు, ఇప్పుడు మనుషులు చంద్రుడి దగ్గరికి కూడా వెళ్లి రియల్ ఎస్టేట్ చేస్తున్నారు... హిహ్హిహీ," నవ్వుతూ కొన్ని ఇటుకలు.



"సర్లే, ఇక నీ గురించి కాదుగానీ, నీమీద ఉన్న మనుషుల గురించి ఏదైనా కథ చెప్పు, వినాలని ఉంది," వేరే ఇటుకలు.

"మనుషుల గురించా..." నేను.

"అవునవును..." ఇటుకలు ముచ్చటపడ్డాయి.

ఆ మాటలకి చుట్టున్న గాలికి ముచ్చెమటలు పట్టాయి. ఎండ మరీ ఎక్కువగా లేదుకానీ దూరంగా పడున్న ఇసుక ఉడుకుతున్నట్టు మాత్రం లోపలేదో కాలుతున్న చితుల మంటల వేడి.

మనుషుల కథలు... చీకటి వెలుతురు పడే నాపై మనిషి చేసిన ప్రయాణంలో కష్టాలు కన్నీళ్లు, ప్రేమ ద్వేషాలు, సుఖం దుఃఖం, అనాగరికత నుండి వాళ్లది వాళ్లు తయారు చేస్కున్న నాగరికత వరకు చాలా స్పష్టంగా చూసానని బాధతోనో సంతోషంతోనో ఏం చెప్పాలి ఈ ఇటుకలకు ?! ఆ ఆలోచనల ఉండగానే ఒక్కసారిగా బూమ్‌మని ఓ శబ్దం.! దూరం నుండి వేగంగా నా అంతర్భాగంలో ప్రయాణించిన కొన్ని తరంగాల వల్ల ఒక్కసారిగా నేను కంపించినట్టు కొంచెం కదలక తప్పలేదు. అది నేనుగా కదిలింది కాదు ఎవరో నూకినట్టులాంటిది, మళ్లీ వెంటనే ఇంకోచోట భూమ్ అంది. బ్లాస్టింగ్... మునుపటి కంటే ఇంకెక్కువ బలంగా నన్ను కదిలించాయి. నా పైన పేర్చినట్టుగా ఉన్న ఇటుకలు కాస్త ఎగిరినట్టై కొన్ని నామీద పడి విరిగి పోయాయి, భయానికి మరికొన్ని ఏడ్వడం మొదలెట్టాయి.

"బ్లాస్టింగ్లు బిడ్డా... బ్లాస్టింగ్లు. రొమ్ముల్లాంటి నా కొండలను పేల్చేస్తున్నారు. మనుషుల వల్ల భూమికి బ్రెస్ట్ క్యాన్సర్ సోకిందిలే...ఏం భయపడకండి," అని అభయమిస్తూ, "వీళ్ల గురించి కథలు ఏం చెప్పను... ఎన్నని చెప్పను. అయినా ఇప్పటికిప్పుడు అంటే ఎక్కడి నుంచి చెప్పను? ఆదిమానవుడి కాలం నుంచి ఉంది కథ. పోనీ రాజుల కాలం అప్పటివి చెప్పాలా... దాంట్లో ఎవరి గురించి చెప్పాలి? ఒక్కో దిక్కు నుండి ఒక్కో పరిపాలన జరిగిన నేల ఇది. శాతవాహనులు, కాకతీయ సామంతుల పొలాస రాజులు, నిజాం పరిపాలన, దొరల పరిపాలన. ప్రభుత్వాలు, నక్సలైట్లు, ఉద్యమాలు ఎన్నో చూసిన దాన్ని ఏం చెప్పాలి దాంట్లో. జైత్రయాత్ర నుండి రాష్ట్ర సాధన...." నేను ఇంకేదో చెప్పబోతుంటే నాపై కూలీపని చేసే మనుషులు ఒక్కసారిగా ప్రోక్లీనర్ వైపు పరిగెత్తసాగారు.

"ఏమైంది?" అని ఇటుకలు కూడా అన్నీ ఒకేసారి అటు దిక్కు చూడసాగాయి.

ప్రోక్లీనర్ తవ్వుతున్న దాంట్లోంచి దుమ్ములేపు కుంటూ అస్థికల్ని బయటకు తీసింది. అక్కడున్న మనుషుల్లాగే ఇటుకల్లో కూడా కొన్ని వాటిని చూసి భయపడ్డాయి. కానీ అందులోంచే ఒకటి ఉత్సాహంగా, "ఆ అస్థికలు మనుషులవే కదా, వీళ్ల కథ ఏంటో చెప్పు... వింటాం," అనింది.

బయటపడ్డ అస్థికలను చూసి, కాస్త నిట్టూర్చి మెల్లిగా కథ చెప్పడం మొదలెట్టాను.

"ఇప్పుడంటే నా ముందు రోడ్డు, పక్కకు షాపులు ఇల్లులు ఉన్నాయని నన్ను నాలా (నాన్-అగ్రికల్చర్ ల్యాండ్) కిందికి పేర్కొన్నారుగానీ అప్పుడు నేను ఓ సాగు భూమిని. ప్రభుత్వ లెక్క ప్రకారం అప్పుడు ఈ ప్రాంతం మొత్తం కల్లోలిత ప్రాంతంలో భాగం. కృష్ణయ్య పనితనం చూసి దొర నన్ను దానంగా ఇచ్చాడు. కిష్టయ్య చేతి తనంతో ఎన్నో పంటలు పండేవి. మొత్తం పైరుతో ఉండడంతో అసలు మట్టి అనేది కింద ఉన్నదోలేదో అన్నట్టు, పచ్చదనంతో నిండి ఉండేది. పొలానికి మధ్యలో ఒక ఎనిమిదేండ్లు వయసున్న యాపచెట్టు ఉండేది. దానికింద ఓ నవారు మంచం వేసుకొని కూర్చుంటుండే కిష్టయ్య. గోరింక, పాలపిట్టల సప్పుడుతో, మందలుగా కుందేల్ల పరుగులు, నాట్యమాడినట్టు తిరిగే పాము పిల్లలు, ఆకాశం నుండి ఊడి పడ్డట్టుగా వాలే కొంగలు. అన్నిటినీ ప్రేమించే వ్యక్తి, మరీ ముఖ్యంగా నన్ను. చేతులారా మట్టిని ఒంటికి పూసుకునే వాడే తప్ప, ఏనాడు అంటిన మట్టిని 'ఛీ' అని దులుపుకున్నోడైతే కాదు. మట్టంటే అంత ఇష్టమున్న వ్యక్తులు ఈమధ్య కరువయ్యారు. మనసు బాలేని సందర్భాల్లో నాపై నీళ్లు చల్లుతూ పోయేవాడు, దాంతో నేను వెదజల్లే మట్టి వాసనకు ముక్కు ఉబ్బించుకుంటూ ఉత్తేజపడి అన్నీ మర్చిపోయేవాడు. హద్దుల దగ్గరే చెప్పులు విడ్చి నా మీద పాదాలు పెట్టి పులకరించిపోయేవాడు. అప్పుడప్పుడు చిటికెడు మట్టి అట్ల నోట్లో వేసుకొని తిని సంబురపడేవాడు."

"ఒకసారి తెల్లవారు దాకా ఇంటికి పోకుండా అక్కడే పడుకున్నాడు. రాత్రి భర్త ఇంటికి రాకపోయేసరికి లక్ష్మి పిల్లల్ని పోయి చూసి రమ్మన్నట్టుంది, నాలుగు లేత బుడి బుడి పాదాలు నాపై ముద్దాడినట్టు పరిగెత్తాయి. పెద్ద పాదలకి ఏడేండ్లు, చిన్న పాదాలకి నాలుగేండ్లు. పొలంగట్ల మీద అన్న వెనుకనే పరిగెట్టుకుంటూ ఒక చోటా ఇస్కుడిస్కుడు ఉండేసరికి, జర్రున జారిపడ్డాడు చిన్నోడు. ఏడ్పుడు షురూ చేయగానే పెద్దోడు వచ్చి ఊకుంచుకుంటా 'నేల కాళ్లను జారేటట్టు చేసిందా? నేలను కొడదామా' అని నన్ను చేతులతో రెండేసి కాళ్లతో నాలుగుసార్లు తన్నిండు పెద్దోడు. సరిపోలేదేమో చిన్నోడు కూడా మెల్లగా లేసి రెండు తన్ని ఊరుకున్నాడు. కిష్టయ్య దగ్గరకు రాగానే ఆయనతోపాటు వీళ్లు కూడా వేప కొమ్మకి మంజన్ కలిపి పళ్లు తోముకొగానే కిష్టయ్య బాయికాడ తానం చేసి ఇంటికి తీస్కపోతూ, పడ్డచోట మళ్లీ నన్ను తన్నుకొని పోయేటోడు చిన్నోడు. అలా ఆ రోజే కాదు వచ్చిన ప్రతిసారి ఆ చోటును తన్నుకుంటూ పోయేటోళ్లు. నాకు నవ్వొచ్చి ముచ్చటేసేది. ఇంకోరోజు ఇరిగిన తన పంటిని నాలో దాచిపెట్టి నాలుగురోజులకి చూసి బంగారం కాలేదని కోపంతో నన్ను ఇంకా గట్టిగా తన్నడం మొదలెట్టారు."

కిష్టయ్య ఓసారి చూసి. "అట్ల తన్నొద్దు బిడ్డా. ఈ నేలమ్మ... కాదు కాదు ఈ మొత్తం భూమాత అంతలా తిరుగుతున్నది కేవలం మనకి వెలుతురు ఇవ్వడానికే కదా! దానికి తోడుగా ఇంతలా సారాన్ని అందించేది మనకి బుక్కెడు తిండి పెట్టడానికే కదా! బరువు అనుకోక బాధ్యతగా మనల్ని నిండు నూరేళ్లు మోసే తల్లికి తిరిగి ప్రేమించకపోయినా పర్లేదుగానీ తన్ని ద్వేషం మాత్రం చూపించొద్దు బిడ్డా!" అనుకుంటూ నన్ను ప్రేమగా నెమురుతూ చెప్పాడు.

"కాలం గడుస్తున్నకొద్దీ లేత పాదాలు రాటు తేలి పోయాయి. పెండ్లీలు చేసుకుని పిల్లల్ని మోస్తూ బాధ్యతతో బరువైన పాదాలతో నామీద తిరగసాగాయి. కిష్టయ్య చనిపోయిండు. చివరి కోరిక మేరకు నాలోనే పాతిపెట్టారు. నా మీద తిరుగుతున్న వ్యక్తి నాలో కలిసి పోవడం నాకు కొత్తేమీ కాదు, కాని అతని భార్య లక్ష్మికి అతనంటే ప్రాణం. కండ్ల ముందు లేక విలవిలలాడేది. సంగీతంలా వచ్చే ఆమె గజ్జల సవ్వడితో కందిపోయిన కాళ్లతోనే పొలమంతా కలియతిరిగేది. ఇప్పుడా కాళ్లకి సవ్వడి లేదు, కళ తప్పింది. నా మీదున్న పొలం చూసి నప్పుడల్లా అతనే గుర్తొచ్చేవాడేమో... ఆమె కన్నీళ్లు నాలో ఇంకినప్పుడు వాటి బరువు కిష్టయ్య బరువంత ఉంటా యని నాకు మాత్రమే తెలుసు! నా లోపల అతను రోజు రోజుకూ కలిసిపోతూ, తన పొలానికి తానే ఎరువులుగా సారం ఇచ్చేస్తుంటాడు! కొద్దిరోజులకే అతినికి తోడుగా లక్ష్మి కూడా నాలోకి వచ్చేసింది. దుమ్ము ధూళి పేరుకుపై ఉండొచ్చేమోగాని కిష్టయ్య దంపతుల పాదముద్రలు ఇప్పటికి నేను భద్రంగా దాచుకున్నాను."

అలా ఇటుకలు శ్రద్ధగా వింటున్నప్పుడు మనుషులు పరిగెడ్తూ మళ్లీ ప్రొక్లీనర్ తవ్విన మరోచోటు దగ్గర చుట్టూ చేరారు. ఇటుకలు మళ్లీ చూడసాగాయి, తవ్విన దుమ్ములోనుంచి మరో ఆస్తికలు బయటపడ్డాయి.

"అర్థమైంది ఇది లక్ష్మిది అయ్యుంటుంది కదా?" ఇటుకలు.

"అయ్యో, కాదు. నేనింక కథ పూర్తి చేయలేదు. ఇంతసేపు చెప్పింది కిష్టయ్య అస్థికలు గురించే కాదు. ముందు బయటపడ్డవి పెద్దోడు రామ్‌వి, ఇప్పుడు బయటపడ్డవి చిన్నోడు లక్ష్మణ్‌వి!" కాస్త నిట్టూరుస్తూ చెప్పాను.

"ఏంటీ! నువ్వు చెప్పిన లెక్క ప్రకారం వాళ్లిద్దరికీ 40-45 ఏళ్లలోపు వయసు. అప్పుడే ఎలా పోయారు?" ఇటుకలు కాస్త అయోమయంగా.

అప్పుడే రోడ్డు మీద నుండి నా మీదికి ఒక కారు వచ్చి ఆగింది. దాంట్లో నుంచి నా జాగిర్దార్ మల్లేశం దిగాడు. అస్థికలు చుట్టూ చేరి గుసగుసలాడుతున్న కూలీ లను చూసి "ఓ ప్రొక్లీనరు... అలా తీసిపెడ్తే భయ పడ్తారయ్య, కాస్త మెల్లిగా పక్కకు పెట్టేసెయ్. అమ్మ, మీరంతా అవి పట్టించుకోకుండా వెళ్లి పన్లు కానివ్వండి. భయపడకండి, నాకు తెలిసిన వ్యక్తుల అస్థికలే, పాపం ఇద్దరు అన్నదమ్ములు... చంపుకొని సచ్చారు," అంటూ చెప్పేసి ఫోన్ రాగానే అందులో మునిగాడు.

ఇటుకలు ఇంకాస్త ఆశ్చర్యపోయి, "చంపు కున్నారా?!" అని ఒకిటుక, "ఆగండే, మొత్తం కథ చెప్ప నివ్వండి అసలు," అని మరొకటి అనగానే నేను మళ్లీ మొదలెట్టాను,

“నిజానికి వాళ్లు ఇంకా బతికి ఉండాల్సింది. అయ్యవ్వలు చనిపోగానే చాలా మార్పు వచ్చింది, పొలం పంచేసుకున్నారు. జేష్ఠప్పాల కింద పెద్దోడికి ఎకరం మీద అరెకరం ఎక్కువ కావాలన్నపుడే ఇద్దరు కొట్లాడుకున్నరు. పెద్ద పంచాయితే అయ్యింది. మొత్తానికి పెద్దలు తేర్చి, చెరో ఎకరం ఇచ్చేసి కూర్చోబెట్టారు.”

“ఉండడానికి ఉన్న ఒక్క ఇల్లు కూలగొట్టి పక్క పక్కకే రెండు ఇల్లులైనయ్. మాట్లాడుకోవడం మానేసి ఎవరి ఎకరం పొలం వాళ్లు చూసుకోసాగారు. అన్న దమ్ములే కాదు ఈ ఇయ్యపురాల్లు ఇద్దరు కూడా అలాగే ఉన్నారు. పచ్చిగడ్డేసిన భగ్గుమని మండే అంత వైరం. ఇదిలా ఉంటే, ఇప్పుడున్న నా జాగిర్దార్ మల్లేశం అప్పుడు తన బయట చదువు బంద్ చేసి ఊర్లో రాజకీయంగా బలపడదామని ఊరి మీదపడి తిరగడం మొదలెట్టాడు. దానికి ఎంత భూమి ఉంటే అంత బలమని తెలుసుకొని పొలాలు చాలానే కొన్నాడు. మనుషులకి గాలం ఏసుడు, ఆళ్ల భూములకి వేలం ఏసుడు ఆడి పనైపోయింది. అలా కొంటూ కొంటూ అంతా ఒకే దిక్కు ఉంటే మంచిదని తన పక్క పొలం అయినా పెద్దోడు రాములు దగ్గరికొచ్చి, ‘పొలం అమ్ము తావే రామన్న?‘ అని అడిగిండు. అప్పటికే అప్పులు చేసి వ్యవసాయంలో నష్టంలో ఉండగా పొలం అమ్మక తప్పట్లేదు అనిపించినా సందర్భం చూసి అడగడంతో ‘సరే‘ నన్నాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్నోడు చాలారోజుల తర్వాత పెద్దోడి ఇంటి లోపలికి వెళ్లాడు.”

“బాపు సాగు చేసిన పొలం, అంత కష్టంగా ఉంటే అమ్ముకో కానీ అమ్మేదేదో నాకే అమ్మరాదు. అప్పు చేసైనా కొంటగాని బయట ఎవనికో అమ్ముతానంటే మాత్రం నేనూరుకోను అన్నా. ఎన్ని గొడవలు వచ్చిన మనం మనం ఆదుకోవడానికే ఉన్నాంకదే, మరి బయట ఎవన్కో అమ్ముడు ఎందుకు?” అని ఒప్పించి ఎకరం పొలం రెండు లచ్చలకి రాముని దగ్గర నుండి లక్ష్మణు కొన్నాడు.

ఈ విషయం తెల్సుకున్న మల్లేశం,

“నేను కొందామనుకున్న పొలంని నువ్వు కొన్న వేందే?” అని లక్ష్మణ్ దగ్గరికి వచ్చి అడిగాడు.

“అన్న పొలం పక్కనే నాది ఉంది కదా, తర్వాత నీ కన్ను నామీదనే కదా పడేది. అందుకే ముందే కొనేసిన. ఇప్పుడు రెండెకరాలు నావే. కొనేది ఉంటే ఎకరం ఐదు లచ్చలు,” అని లక్ష్మణ్ మల్లేశంతో బేరమాడిండు!

మల్లేశంకు ఇజ్జత్ ముఖ్యం, లక్ష్మణ్‌కి పైస పిసా. “డబ్బులు అరేంజ్ చేస్కొని, నెలరోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటా. ఇదిగో అడ్వాన్స్. మీ అన్న దగ్గర చూపిన లంగ తెలివితేటలన్ని నా దగ్గర మాత్రం చూపించకు.” మల్లేశం. తెల్లారేసరికి మాత్రం రామునికి ఈ విషయం తెలిసిపోయింది.

ఇటుకలు నిదానంగా, “ఇప్పుడు అర్థ మైంది ఎందుకు చంపుకొని చచ్చారో. సెంటి మెంట్తో అన్న పొలం తక్కువకి కొని తర్వాత తన పొలంతో సహా ఎక్కవకి అమ్మి వ్యాపార బుద్ధి బయటేసిండు. ఏర్పడకుండా నువ్వు సాగు భుమి నుండి రియల్ ఎస్టేట్ భూమి వైనవ్! పైసలు తినే కాడ నువ్వు (నేల) కూడా భలే నోరూరిస్తుంది,” నవ్వుకున్నాయి.

“లేదు అసలు కథ ఇప్పుడే మొదలైంది. డబ్బు చేతిలో పడ్డాక మనిషి అసలు రంగు బయటపడుతుంది. లుంగి బనీన్ మీద తిరిగే లక్ష్మణ్ ఖద్దర్ ఏసిండు, ఆ తెలుపులో కొన్ని కండ్లు చీకటిని చూడసాగాయి. బండితో పాటు ఓ కారు కూడా కొన్నాడు. కొంటే కొన్నాడు కానీ



రోజు పెద్దోడు ఎడ్ల బండి మీద వెళ్తుంటే, వెనకే కారులో వచ్చి హారన్ కొడ్తూ పక్కకు జరగమంటాడు. పెద్దోడు ఇంటి ముందు వేసిన ముగ్గు మీద బురద టైర్లతో కరబ్ చేస్కుంటాపోతాడు. ఇలాంటి చేష్టలకి పెద్దోడికి ఆని పెండ్లాంకి రాత్రులు నిద్రపట్టేది కాదు.

ఓరోజు, తెల్లారి లేచి చూసేసరికి కార్ అద్దాలు పగిలిపోయాయి. అన్నదమ్ములు రోడ్డు మీదనే అంగీలు చింపుకునేంత కొట్టుకున్నారు."

"చిన్నోడు ఉన్న ఇంటిని రెండంత్రాలు లేపిండు. ఇల్లు కడ్తున్నప్పుడు ఆనుకొని ఉన్న పెద్దోడు ఇంటి మీద పడే బురదలాంటి సిమెంట్ చూసి ముసిముసిగా నవ్వాడుగానీ ఇంట్లో పడ్డ చెత్తని పట్టించుకోనట్టే చేసిండు. ఓ రోజైతే పెద్దోడి మొహం మీద, ఆని పెండ్లాం నెత్తి మీదనే సిమెంట్ పడ్డది, అయినా పట్టించుకోనట్టే చేసిండు. రోజురోజుకూ చిన్నోడి ఇల్లు కట్టుడేమోగానీ పెద్దోడి ఇంటి గోడలు బురదబురదై చెత్త పెరిగి పోయింది".

"భూమి విషయంలో చేసిన ద్రోహం వాడికి తెచ్చి పెట్టిన రాజయోగం చూసి మింగుడుపడక పెద్దోడు రోజు తాగడు అలవాటు చేస్కున్నాడు. ఇప్పుడు రోజు నా ముందున్న దారి పొంటపోయే రాజేశం గౌడ్ వాళ్ల నాన్న ప్రభాకర్ గౌడ్ అప్పట్లో ఓ కల్లు కంపౌండ్ నడిపేటోడు. బాగా తాగితే ఆయన్నే పెద్దోడ్ని ఇంట్ల దించి పోయే టోడు. ఓసారి తాగేటప్పుడు, "మన సీతక్క పొలం రోడ్డుకే ఉన్నా కొనడానికి ఎవలు అత్తలేరంటా. దాని సెల్లే దానికి దక్కలేదని కోపంతో పొలంకి చేతబడి చేయించిందటా! ఓ తాయత్తు, కొన్ని యంత్రాలు నిన్న బయటపడ్డే అక్కసెల్లెలిద్దరు పొలంలనే జుట్లు పీకున్నరు," అని ముచ్చట పెట్టుకోంగా అది పెద్దోని చెవుల పడ్డది. ఆ ఆలోచనలతోనే ఇంటికి వచ్చి కూర్చున్నాడు. అర్ధరాత్రైనా నిద్రపట్టక సైకిల్ పైన ఊరి చివర మంత్ర గత్తె ఇంటి దిక్కు బయలిదేరిండు.

ఆ రోజు అమాస,

సూర్యుడు జారుకున్నాడు... మనుషుల నీడలు మాయమవుతున్న సమయం అది... నిజానికి అసలు నీడలు బయటపడే సమయం కూడా అదే.

తమ్ముడి పొలంలోకి తాయత్తు, యంత్రాలు పట్టుకొని పోయిండు. విషయం ముందే తెలుస్కున్నట్టున్నాడు లక్ష్మణ్. రాముని కోసమే పొలంలో ఎదురు చూస్తున్నాడు! ఒకరినొకరు చూస్కోగానే ఆవేశంతో ఆ చీకట్లోనే కొట్టుకోసాగారు. ఎంతసేపు తిట్టుకున్నా తన్నుకున్న తనివి తీరలేదు ఇద్దరికి. వాళ్లు అరుస్తూ కొట్టు కుంటుంటే పొలం బయటున్న ఊరు కుక్కలు వచ్చి మౌనంగా నిల్చోని వాళ్లనే చూడసాగాయి! అప్పటికే ఇద్దరు మద్యం మత్తులో ఉండడంతో కాసేపటి తర్వాత కూలబడ్డారు. నన్ను వాళ్లు చిన్నప్పుడు కొట్టి తన్నిన చోటే ఇప్పుడు కొట్టుకున్నారు! తవ్వి పన్ను దాచినచోటే పళ్లు రాలగొట్టుకున్నారు. చీకట్లో కూడా ఎర్రమట్టి మీద పడ్డ వాళ్ల రక్తం మరకలు మెరిసాయి. అలా కూలబడ్డారో లేదో మళ్లీ కాసేపటికి లేచి కొట్టుకోసాగారు, కానీసారి చిన్నోడు మాత్రం దాచుకున్న చిన్న కత్తిని బయిటికి తీసాడు!!

తెల్లవారుతుంది,

ఎప్పటిలా పొలంలో నుండి కల్లు కౌంపౌండ్‌కి వెళు తున్న ప్రభాకర్ గౌడ్ పడిపోయినట్టున్న రామ్, లక్ష్మణ్‌ని దూరం నుండే గుర్తుబట్టి,

'ఈ నా కొడుకులు అయ్యవ్వలు గెట్లు వెట్టక ముందే ముఖాలకు గాట్ల పడేదట్టు కొట్టుకున్నోళ్లు. ఇప్పుడు ఆళ్లు లేకపోయేసరికి ఇరం లేని లొల్లైతుంది. ఆయినా ఇక్కడికచ్చి తాగింద్రేంది, నా కల్లును కాకుండా బీర్లకు ఎగబడి సచ్చారా...' అనుకుంటూ దగ్గరికి వెళ్ల గానే ఇద్దరు రక్తం మడుగుల్లో కనపడడం చూసి కాసేపు ఒక్కసారిగా ఒళ్లంత వణుకొచ్చి, ఏడుస్తూ ఊర్లకి పరిగెట్టాడు. సంపుకున్న సంగతి ఊరంత పాకింది. పోలీసులు, పోస్టుమార్టమ్లు తర్వాత వాళ్లిద్దర్ని ఇక్కడే పాతిపెట్టారు.

"హమ్మ్... అదన్న మాట కథ. భూమిని నమ్ముకొని బతికినోడు కిష్టయ్య సావుకి, భూమిని అమ్ముకొని బతుకు దామనుకొన్న ఆ నా కొడుకుల సావుకి తేడా సూడండే!" ఓ ఇటుక.

"అయినా ఈళ్లన్నా నయం, ఎకరాల కోసం కొట్టు కున్నరు. అదే ఇప్పుడు ఒక ఒంట్ కోసం, ఒక ఇటుకంత జాగ కోసం కూడా కొట్టుకుంటున్నారే," మరో ఇటుక

"అందరి కథలు ఇట్లలేవు బిడ్డా, అమ్ముకొని కూడా సక్కగా బతికి మళ్లా భుములు కొన్నోళ్లు కూడా చాలానే

మంది ఉన్నారు. అంతా పైసలు చేతుల పడ్డాకా బతుకే తీరునుబట్టే ఉంటది."

"సంపుకున్నంక కూడా కొట్టుకు సస్తరేమోనని, వాళ్ల సమాధుల్ని దూరంగా కట్టారా," నవ్వుకుంటూ ఓ ఇటుక.

"అయినా చచ్చి వాళ్ల అయ్యవ్వల దగ్గరికే పోయారుగా, ఆళ్లు కొట్టుకోకుండా ఆపుతరులే," అని మరో ఇటుక నవ్వింది.

"అలా కాదుగానీ మీకు ఇంక అసలు సంగతి తెలీదు. అప్పుడు వాళ్లిద్దరిని పాతిపెడితే ఇప్పుడు అస్థికలైనా బయటపడ్డాయి, కానీ వాళ్లతోపాటు ఓ నిజాన్ని కూడా పాతిపెట్టారు, కానీ అదెప్పటికీ బయటపడదు," అన్నాన్నేను.

"ఏంటదీ?" ఒకేసారి అన్ని ఇటుకలు,

"వాళ్లిద్దరు చంపుకోలేదు, చంపబడ్డారు.! చంపింది నా ఇప్పటి జాగిర్దార్, అప్పుడు పొలం కొన్న మల్లేశం! అంత వాడు చేసిన రాజకీయమే!"

"!!!", ఇటుకలు,

"లక్ష్మణ్‌కి అన్న పొలం కొనాలనే ఆలోచన వచ్చేలా చేసింది... అడ్వాన్స్ ఇచ్చి డబ్బు ఆశ చూపించి... ఖద్దర్ ఏపించి... రామునికి మందు అలవాటు అయ్యేలా చేపించి... లక్ష్మణ్ కొన్న కొత్త కారు అద్దం పగల గొట్టింది... అంత వాడి రాజకీయమే! నిజానికి ఆరోజు రాత్రి కొట్టుకొని కొట్టుకొని పడిపోయారేగానీ, కత్తులు బయటికి తీసారుగానీ చంపుకోలేదు. వెనక నుండి వచ్చి మద్యం మత్తులో పడున్న ఇద్దర్ని పొడిచి చంపి పారిపోయిండు వాడు! 'అడ్వాన్స్ మాత్రమే కాదు మొత్తం పైసలు వసూల్ జేసిన తర్వాతే చంపుకొని సచ్చారని,' ఊరంత నమ్మించి నన్ను లాక్కున్నాడు. అలా అప్పటినుండి రిజిస్ట్రేషన్ పేపర్లో నేను వాడి పేరుమీద ఉన్నాను."

"ఈ చుట్టూ ఉన్నా చాలా జాగలు మల్లేశం పేరు మీదనే ఉన్నాయి. రోజుకు చాలాసార్లు నన్ను కంపించే కొండల బ్లాస్టింగ్ ప్రాజెక్ట్ కూడా ఆడిదే. పక్కన కడ్తున్న షాప్లకి, సెల్ టవర్లకి, థియేటర్లకి ల్యాండ్ మొత్తం వాడిదే. కానీ ఆ జాగల అసలు జాగిర్దారులు అందులో ఎప్పుడో పాతిపెట్టబడ్డారు! ఇదిగో ఎప్పుడో ఇలా ఏదైన కట్టడానికి వాళ్లు అస్థికలుగా బయటపడ్తారు."

ఇటుకలు కాసేపు నిశ్శబ్దమైపోయాయి. మళ్లీ తేరుకొని,

"ఏంతైన నువ్వు భలేదానివి. భూమిగా, అందులో నేలగా, మట్టిగా, మనుషుల్ని నూరేళ్లు మోస్తవేమోగానీ, వాళ్లకు సంబంధించిన కథల్ని, నిజాల్ని కూడా ఎన్నో నూరేళ్లు మొస్తుంటావు కదా! అలా అని ఎంత భయంకరమైన, ఎంత బాధకరమైన సంఘటల్నీ చూసిన కనీసం కూడా కదలవు అన్పిస్తుంది, కానీ నిజానికి ఎప్పుడూ కదుల్తూనే చీకటి వెల్తురిని ఇస్తావ్. కొండల్ని మోసేంత గట్టిగా ఉంటావ్, చుక్క నీరుని కూడా ఇంకించుకునేంత మెత్తగా ఉంటావ్. అర్థమైనట్టే ఉండి అర్థంకాని (చేస్కోలేని) అద్భుతంవి నువ్వు," ఇటుకలు.

కాస్త నవ్వి, "నేను చెప్పింది కేవలం తవ్వకాల్లో బయటపడ్డ కథ, అసలు తవ్వుతున్నాకొద్దీ ఎన్ని కథలు ఎల్తయి. ఈ ఒక్క జాగనే కాదుగా, ఎన్ని జాగలు కలిస్తే ఊరు పట్నాలు అవుతాయి, ఎన్ని ఊర్లు పట్నాలు కలిస్తే రాష్ట్రాలవుతాయి, అవన్ని కలిసి ఎన్ని దేశాలవుతాయి.... ఎన్నెన్నో కథలెల్తాయబ్బా!!" అన్నాను.

"అట్లనే చుక్క నీటిని ఇంకించుకునేంత మెత్తగా ఉంటనని అంటున్నారు కదా, అప్పుడప్పుడు అదెంత కష్టమో తెల్సా. మనుషులు నాపై ఉచ్చలు పోసిన, పాన్ పరాక్లతో ఉమ్మిన, మందు ఎక్కువై కక్కిన కంపు కొట్టలేదు కానీ మంచి అనే ముసుగులో కార్చిన కన్నీళ్లే రోత పుట్టించాయి. కానీ తప్పదు మిగితా నీటిలాగే వాటిని ఇంకించుకోవాలి. మల్లేశం రామ్ లక్ష్మణ్‌ల శవాల ముందు ఏడ్చినప్పుడు కార్చిన కన్నీళ్లు కూడా అలాగే ఇంకించుకున్నాను," అన్నాను.

ఇటుకలు కాసేపు మౌనం తర్వాత,

"సర్లే, నీకు తెలీని మనుషులు, నీకు తెలియని కథేముందిగానీ మాకు మాత్రం ఓ చిన్న అసహనం ఉంది. మమ్మల్ని మల్లేశం తన ఇల్లు కట్టుకోడానికి తెచ్చి పెట్టుకున్నాడు. అలాంటోడితో మేము ఉండదల్చుకోలేదు. ఇల్లంత అయ్యాపోయాక కుప్పకూలిపోతాం. దానికి నువ్వు సాయం చేస్తావా? గట్టిగా కంపించు, మనుషులు నీ కోపానికి బీపీ మీటర్లాంటిది రిక్టర్ స్కేల్ కనిపెట్టారుగా, అందులో రీడింగ్ మూడు కంటే తక్కువగా ఉండి కంపించావే అనుకో మేమంత వాడి మీద పడి నీలో కలిపేస్తాం," అంది ఓ ఇటుక.

"కానీ ఇప్పుడున్న కట్టడాల టెక్నాలజీతో భూకంపం వచ్చిన బ్రతికి బయటపడే మార్గాలు మనుషులు సృష్టించుకుంటున్నారు తెలుసా?" మరో ఇటుక.

ఆ మాటకి నాకు నిజంగా నవ్వొచ్చింది, మొదట చిన్నగా నవ్వి తర్వాత గట్టిగట్టిగా నవ్వుతూ ఉన్నాను. ఆ నవ్వెందుకు అని చూస్తున్న ఇటుకలతో చెప్పాను, "అంత కష్టపడక్కర్లేదు, వాళ్లు మనుషులు... వాళ్లది వాళ్లే నాశనం చేస్కుంటారు, నేను చేయక్కర్లేదు," ఇంకాస్త గట్టిగా నవ్వాను.

*

సరిగ్గా ఆరు నెలలకి...

ఇల్లు మొత్తం పూర్తైంది.

బ్లాస్టింగ్లు ఇంకా జరుగుతూనే ఉన్నాయి, కొండలు కరిగిపోతూనే ఉన్నాయి. ఓ రోజు బ్లాస్టింగ్ తరంగాలకి సెల్ టవర్ అదిరినట్టై మల్లేశం ఇంటిమీద కూలింది.!!

భయంకరమైన శబ్దాలతో గోడలు కూలుతూ వచ్చాయి, లేచిన దుమ్ము గాల్లో పూర్తిగా కలవలేక అక్కడి మందం ఎర్రెర్రగా మారిపోయింది. కుప్పలుగా ఇరిగి పడ్డ ఇంటి గోడల ఇటకల్లోంచి, మల్లేశం రక్తం ముద్దతో తడిసిన ఓ ఇటుక, "నా దెబ్బకి ఈడు సచ్చాడు", అంటూ మిగతా ఇటుకలకి విన్పించేలా అరిచింది.

"ఇక్కడి మట్టి కోరుకుందో లేదోగానీ మనం కోరుకున్నట్టే మల్లేశం బలి అయ్యిండు," అని కింద పడి విరిగినా కూడా ఇటుకల ముఖాల్లో మాత్రం చాలా సంబురం కన్పిస్తుంది.

"మన సంబురం సరేగానీ, మనకి ఇంత కథ చెప్పి, వీడి చావుకి వీడి పనులే కారణమవుతది అని చెప్పిన ఈ నేల తల్లి మాత్రం ఇప్పుడు ఏమి మాట్లడాట్లేదు ఎందుకో," మరో ఇటుక కిందికి చూస్తూ అంది.

(నిశబ్దం)

"అమ్మా... మాట్లాడమ్మ. బిడ్డా... బిడ్డా... అని నీ పిలుపుకోసమే ఎదురుచూస్తున్నాము. మల్లేశం మాత్రమే కాదు వాడు కట్టుకున్న ఇల్లులు, షాపులు, సెల్ టవర్తో కూలిపోయాయి. నీకు తెలుస్తూనే ఉంటదిగా... మాట్లాడు" మరో ఇటుక నేలను చూస్తూ.

(అదే నిశబ్దం)

"దెయ్యం పట్టినట్టే మనుషుల గురించి వాళ్ల కథల గురించి చెప్పావ్, అలాంటి మనిషి ఒకడు సచ్చాడంటే దెయ్యం ఇడిసినట్టే ఏమి ఎరగనట్టు ఏ చప్పుడు చేయ వేంది?" కోపంతో ఓ ఇటుక.

(అదే నిశబ్దం)

ఇటుకలు కాసేపు ముఖాలు చూస్కొని,

"నువ్వు అన్నది కరెక్టే కావచ్చే... మనుషులకి, చెట్లకి, ఇల్లులకి మాత్రమే కాదు కొన్నిసార్లు కొన్ని భూములకి కూడా దెయ్యం పడ్తాయని విన్నా! అప్పుడు అంత మాట్లాడింది దెయ్యమే కావచ్చు," అందో ఇటుక,

"అదే నిజమైతే, మనుషులు సచ్చిన కూడా దెయ్యాలై భూమిని ఇడ్చిపెట్టట్లేదు అయితే. ఇంతకి ఆ దెయ్యం కిష్టయ్యానా? లక్ష్మమ్మనా? రామా? లక్ష్మణా? తెల్సిసావట్లేదు," ఓ ఇటుక.

ఎవరి సంతోషమో లేక ఎవర్ని శాంతించడానికో ఆ రాత్రి చాలా పెద్ద వాన పడింది.

తెల్లారింది...

రాజేశం గౌడ్ రోడ్డు దాటుతూ అవే పద్యాలు పాడుతున్నాడు,

'నిజము మీద భూమి నిలబడి యుండును,' అని, కానీ 'అబద్దం మీద మాత్రం ఈ భూమ్మీద ఏది ఎక్కువ రోజులు నిలబడదు,' అని తెలుసో లేదో.

రోడు దాటేస్తూ మాత్రం ఒక్కసారిగా కూలిన సెల్ టవర్, ఇల్లును చూసి సైకిల్ ఊర్లోకి తిప్పాడు. ఈసారీ ప్రొక్లీనర్ మళ్లీ వచ్చింది... కూలిన సామానంతా ఎత్తి వేరే చోటుకు తరిలిస్తుంది.

ఇటుకలు ఆ చోటును ఖాళీ చేస్తూ, ఆ నేలా ఏమైన బదులు ఇస్తుందోనని వెనక్కి చూస్తూ చూస్తూ తరిలిపోతున్నాయి...

ఆమె మాత్రం ఏ బదులు ఇవ్వలేదు...

కానీ ఎప్పటిలా అక్కడి మట్టి మాత్రం మళ్లీ మొక్కలకు సారాన్ని అందిస్తూనే ఉంది...

ఆమె ఏ సమాధానం చెప్పలేదు...

కానీ ఎప్పటిలా అక్కడి నేల పంచభూతాల్లో ఒకటిగా ప్రాణులను పదిలంగా మోస్తూనే ఉంది...

ఆమె ఏ చప్పుడు చేయలేదు...

కానీ ఎప్పటిలా ఆ భూమి పరధ్యానంగా భ్రమిస్తూ, పరిభ్రమిస్తూ చలనంతోనే నిశ్చలంగా ఉంది. ❁

జ్ఞాపకాలు

# పుస్తకచికిత్స : బిబ్లియోథెరపీ

❖ ౨. జగన్నాథశర్మ

బాబాయ్‌ని చూసి చాలారోజులయింది. చూడాలని పించిందాయన్ని. బయల్దేరాను. సన్నగా చినుకు పడుతున్నది. ఎన్నడో చదవమని బాబాయ్ ఇచ్చిన 'పేదరాశి పెద్దమ్మ కథలు' పుస్తకాన్ని, తలతడవకుండా అడ్డం పెట్టుకుని, పరుగుదీశాను. బాబాయ్ ఇంటికి ఇట్టే చేరుకున్నాను.

"బాబాయ్," అని పిలిచాను. ఆయనరూంకేసి నడిచాను. బెడ్ మీద బోర్లాపడుకుని బాబాయ్ పుస్తకం ఏదో చదువుతున్నాడు. పరిశీలనగా చూశాను దాన్ని. కలెక్టెడ్ స్టోరీస్ ఆఫ్ మార్క్వెజ్.

పుస్తకంలో లీనమై ఉన్నాడు బాబాయ్.

"బాబాయ్," అన్నాను మళ్లీ. గట్టిగా పిలిచాను.



"ఏంట్రా" అన్నాడు బాబాయ్. చూపు మరల్చాడు. నన్ను చూశాడు. ఆసరికి చినుకు పుంజుకున్నది. వాన యింది.

"ఈ వానలో ఎవడయినా వేడివేడి మిర్చీబజ్జీలు తింటాడు. నువ్వేంటి బాబాయ్, ఏదో పుస్తకం పట్టుకుని..." అన్నాను.

"అదేదో సినిమాలో చెప్పినట్టు వర్షంలో మిర్చీ బజ్జీలు ఏ వెధవైనా తింటాడు. వర్షంలో పుస్తకం చదివే వాడే గొప్పవాడు. నీకు తెలియదనుకుంటానుగాని, వర్షంలో పుస్తకం చదువుతూ ఉంటే ఉంటుందిరా... ఆ వేడీ, ఆ మజానే వేరు," అన్నాడు బాబాయ్. తానే పేజీ దగ్గర ఉన్నాడో ఓసారి చూసుకుని, చేతిలోని పుస్తకాన్ని మూశాడు బాబాయ్. పక్కన పెట్టాడు.

"ఏంటిలా వచ్చావు?" అడిగాడు.

"నిన్ను చూడాలనిపించింది, వచ్చాను."

"ఇంకోమాట చెప్పు."

"అయితే...బిబ్లియోథెరపీ అంటే ఏమిటి బాబాయ్? ఈ మధ్య ఈ మాట బాగా వినిపిస్తోంది."

"అలా అడిగావు, బాగుంది." అని నవ్వాడు బాబాయ్.

"అలా కూర్చో," అన్నాడు. కూర్చున్నాను.

వర్షం 'పింక్ నాయిస్' వినసొంపుగా ఉంది. కళ్లు మూసుకుని వినసాగాను. చెప్పడానికి అయి ఉంటుంది, గొంతు సవరించుకున్నాడు బాబాయ్. కళ్లు తెరచి చూశాను.

"బిబ్లియోథెరపీ అన్నది గ్రీకుపదం. 'బిబిలియన్' అంటే పుస్తకం, 'థెరపియా' అంటే వైద్యం లేదా చికిత్స. ఈ రెంటినీ కలిపి 'బిబ్లియోథెరపీ'గా పేర్కొన్నారు. ఈ మాటను 1916లో శామ్యూల్ క్రోథర్స్ మొదటిసారిగా ఉపయోగించాడు. చికిత్సకోసం పుస్తకాల్ని ఉపయోగించడం చాలాకాలం నుంచి వాడుకలో ఉంది. ప్రాచీన గ్రీకు గ్రంథాలయాల మీద 'ఆత్మకు ఔషధశాల' అని రాసి ఉండేది. పుస్తకపఠనం మనసుకు శాంతినీ, స్వస్థతనూ చేకూరుస్తుందన్నది ఏనాడో ఋజువయింది.

"కథ, నవల, కవితలాంటి సాహిత్యప్రక్రియలను ఉపయోగించి, మనిషి మానసిక భావోద్వేగాలను మెరుగుపరచడాన్నే బిబ్లియోథెరపీ అంటున్నారు." చెప్పాడు బాబాయ్.

"పుస్తకాలే టాబ్లెట్లు, పుస్తకాలే కాప్సూల్స్, పుస్తకాలే సిరప్‌లు, పుస్తకాలే ఇంజక్షన్లయితే. బాగుందిదేదో," అన్నాను.

"పుస్తకం గొప్పమంత్రదండంరా! దాని గొప్పతనం అంతుచిక్కదు." అన్నాడు బాబాయ్.

"క్లినికల్ బిబ్లియోథెరపీ, డెవలప్‌మెంటల్ బిబ్లియోథెరపీ, సెల్ఫ్ హెల్ప్ బిబ్లియోథెరపీ అంటూ ఈ బిబ్లియోథెరపీలో చాలారకాలు ఉన్నాయి," అన్నాడు.

"అవన్నీ నాకనవసరంగాని, ముందు ఈ సంగతి చెప్పు? ఓ వ్యక్తి ఓ పుస్తకం చదివాడనుకుందాం. అతని మీద బిబ్లియోథెరపీ పనిచేస్తుందా?" అడిగాను.

"ఎందుకుచెయ్యదు? నిక్షేపంగా పనిచేస్తుంది. తన సమస్యలను పోలిన పరిస్థితులతో ఉన్న పాత్రలను పుస్తకంలో చదివినప్పుడు పాఠకుడు ఆ పాత్రలను మనసుకు దగ్గరగా తీసుకుంటాడు. వాటితో మమేకం అవుతాడు. మమేకం అయి, భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటాడు. ఒకొక్కప్పుడు సమస్యను అర్థం చేసుకుని, దానికి పరిష్కార మార్గాన్ని కూడా తెలుసుకుంటాడు," చెప్పాడు బాబాయ్.

"ఆందోళన, దుఃఖం, ఆత్మవిశ్వాసం లోపించినప్పుడు మనిషికి పుస్తకాన్ని మించిన మంచిమందు లేదురా! చేతిలో పుస్తకం ఉంటే... డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉన్నట్టే," అన్నాడు.

"సరే! నేను 'అమరావతి కథలు' చదువుతున్నాను. ఆ కథలతో బిబ్లియోథెరపీ జరిగి, నేను మునుపటి కంటే బాగుండే అవకాశం ఉందా?" అడిగాను బాబాయ్‌ని.

"ఇప్పుడు నీకొచ్చిన కష్టం ఏమిటి?" అడిగాడు బాబాయ్.

"కష్టంలేదు, ఉందనుకుందాం, ఉంటే... నామీద బిబ్లియోథెరపీ వర్కవుట్ అవుతుందా?"

"ఎందుకు కాదు? ఆధునిక జీవితంలోని వేగాన్నీ, ఒంటరితనాన్నీ, మూలాల నుండి దూరమైన బాధనీ అనుభవించే నీకు అమరావతి కథలు నదినీటి గలగలల్నీ, మానవసంబంధాలనీ, నీ చిన్నతనాన్నీ గుర్తు చేస్తాయి. అమ్మ తల నిమిరినట్టుగా నీ తల నిమిరి, నిన్ను చల్లనిగాలిలో, వెన్నెలరేయిలో ఊరేగిస్తాయి. దీనినే 'నాస్టాల్జిక్ బిబ్లియోథెరపీ' అంటారు," అన్నాడు బాబాయ్.

''అమరావతి ప్రజల అనుబంధాలూ, ఆత్మీయతలూ, కష్టసుఖాలూ చదువుతూ నిన్ను నువ్వు వారిలో వెదుక్కుంటావు. సపోజ్! ఫర్ సపోజ్! ఏదేని బాధలో నువ్వు ఉన్నావనుకో! అదే బాధ కథలో పాత్ర కూడా అనుభవిస్తున్నదనుకో! అప్పుడు నీకేమనిపిస్తుంది? 'ఈ బాధ నాకొక్కడికే కాదు, ముందు చాలామంది అనుభవించారు,' అనిపిస్తుంది. మనసు తేలిక పడుతుంది. ఒంటరితనం ఫీలవ్వవు. దీనినే బిబ్లియో థెరపీలో 'యూనివర్సలైజేషన్' అంటారు. అసలా కథల శైలే గొప్పదిరా! ఆ శైలిలో భావోద్వేగాలను అదుపులో ఉంచే ఓ మహత్తు ఉంది. దానినే 'కథార్సిస్ వితౌట్ ట్రామా' అంటారు," చెప్పాడు బాబాయ్.

"అమరావతి కథల్లోని మానవత్వం, పరోపకారం, దయా, దాక్షిణ్యం, కరుణా, జాలీ... ఇంకా అనేక విలువలు ఇప్పటి సమాజంలో నిన్ను వెదుక్కొనేలా చేస్తాయి. వాటిని పునరుద్ధరించమని నిన్ను ప్రేరేపిస్తాయి. దీనినే 'వేల్యూ రీ–అఫర్మేషన్' అంటారు. దీనికి మరోపేరే 'డవలప్‌మెంట్ బిబ్లియోథెరపీ," అని ఊపిరి తీసు కున్నాడు బాబాయ్.

"మనం ఎంత ఎక్కువగా పుస్తకాలు చదివితే అంత ఎక్కువగా మనుషుల్నీ, వారి అంతరంగాల్నీ తెలుసుకో గలుగుతాం. మనుషుల్ని తెలుసుకున్న తర్వాత నువ్వు ఎక్కడ, ఏ దేశంలో ఉన్నా హాయిగా బతికేస్తావు, నీకె లాంటి ఇబ్బందులూ ఉండవు," చెప్పాడు బాబాయ్.

"పుస్తకాన్ని మించిన నమ్మకమైన స్నేహితుడూ, నమ్మకమైన ప్రేయసీ మరొకరు ఉండరు," అని నవ్వాడు.

"వేడి వేడిగా టీ పెట్టనా?" అడిగాడు.

"ఏలక్కాయ, దాల్చినచెక్క, లవంగం వేసిన వేడి వేడి టీ ఈ వర్షంలో తాగితే ఉంటుందిరా... తాగి నువ్వే చెబుతావు చూడు," అని టీ చేయడంలో పడ్డాడు బాబాయ్.

"రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి 'అల్పజీవి' నవల చదివాను. బిబ్లియోథెరపీపరంగా దానివల్ల నేనేం నేర్చు కుంటాను?" అడిగాను.

"నిరంతరం భయంతోనూ, ఆత్మన్యూనతతోనూ గడిపే అల్పజీవి సుబ్బయ్యను చదివితే... ఆత్మదర్శనం అవుతుంది. ఆత్మన్యూనతపై అవగాహన ఏర్పడుతుంది. మధ్యతరగతి ప్రజలమీద కరుణ కలుగుతుంది. సానుభూతి పెరుగుతుంది. సుబ్బయ్యేకాదు, చుట్టుపక్క లందరూ అల్పజీవులే అన్న ఎరుక కలిగి, ఎలా బతకాలో ఓ పాఠకుడుగా నువ్వు తెలుసుకుంటావు," అన్నాడు బాబాయ్.

వేడివేడి టీ అందజేశాడు.

బాగుంది టీ. గొప్పపుస్తకం ఏదో చేతికి దొరికి నట్టనిపించింది.

"నేనిందాక చెప్పినట్టుగానే పుస్తకాన్ని మించిన ఫ్రెండ్ లేదురా! పక్కన పెట్టినా, నీకోసం పరితపిస్తాయవి. ప్రేమిస్తే ఇక చెప్పలేం, చిలకలు వాలినట్టుగా నీమీద వాలిపోతాయి. నిన్ను చిలకలు వాలిన చెట్టుని చేస్తాయి. ఇక చూస్కో! ఒకటే కలకలం," అన్నాడు బాబాయ్.

"అక్కడెక్కడో నిధులు ఉన్నాయి, పద, తెచ్చు కుందాం అంటే నేను పరిగెత్తను. చేతులెత్తి దండం పెట్టినా రాను. అదే అక్కడెక్కడో పుస్తకాలు ఉన్నాయని చెప్పు, పరిగెడతాను. పుస్తకాల్లో లేని నిధులు ఏం వున్నాయిరా?" ప్రశ్నించాడు బాబాయ్.

"పుస్తకాలమీద ఇంట్రస్ట్ లేదండీ అనేవాళ్లు చాలామంది కనిపిస్తారు. వారిని చూసి జాలిపడాలి. ఎందుకంటే... వారికి ఇంతవరకూ సరైన పుస్తకం దొరికి ఉండదు. దొరికి ఉంటే దాని మహాత్మ్యం చూపించేది," అన్నాడు బాబాయ్.

''మనల్ని ఏకాంతతీరాలకు చేర్చే పుస్తకాన్ని మించిన ప్రయాణసాధనం ఇంకొకటి లేదురా! పుస్తకం పుస్తకమే! తర్వాత ఇంకోమాట! చేతిలో పుస్తకంలేని వాడిని చచ్చినా నమ్మకూడదు," అన్నాడు బాబాయ్.

నా అదృష్టం బాగుంది, చేతిలో పేదరాశి పెద్దమ్మ కథల పుస్తకం ఉంది. బతికిపోయాననుకున్నాను.

"చినుకూ చినుకూ కలిస్తే వాన ఎలా అవుతుందో అలాగే పదమూ పదమూ కలిస్తే గొప్ప శక్తి పుడుతుంది. ఆ శక్తిని ఆవాహన చేసుకున్నవాడే అదృష్టవంతుడు," అన్నాడు బాబాయ్.

కిటికీలోంచి వర్షాన్ని చూస్తూ నిల్చున్నాడు.

గాలి వీచింది. కిటికీలోంచి ఒలిపిరి కొట్టింది. మంచమ్మీది మార్క్వెజ్ కథల మీద వానజల్లు కురిసింది.

ఉత్తర అమెరికా తెలుగు సంఘము

# TELUGU ASSOCIATION OF NORTH AMERICA

OUR MISSION: TO IDENTIFY AND ADDRESS SOCIAL, CULTURAL AND EDUCATIONAL NEEDS OF NORTH AMERICAN TELUGU COMMUNITY IN PARTICULAR AND TELUGU PEOPLE IN GENERAL

TELUGU ASSOCIATION OF NORTH AMERICA, INC.

TANA

ఉత్తర అమెరికా తెలుగు సంఘము

Our Youth are Our Heritage

Est:1977

www.tana.org

# TANA ADVERTISING OPPORTUNITIES

## E - PATRIKA

| DESCRIPTION | 6-ISSUE | 12-ISSUE |
|---|---|---|
| FRONT INSIDE COVER PAGE | ~~$ 1,650~~ $825 | ~~$ 3,000~~ $1500 |
| BACK OUTSIDE COVER PAGE | ~~$ 1,650~~ $825 | ~~$ 3,000~~ $1500 |
| BACK INSIDE COVER PAGE | ~~$ 1,500~~ $750 | ~~$ 2,750~~ $1375 |
| FULL PAGE | ~~$ 1,250~~ $625 | ~~$ 2,300~~ $1150 |
| HALF-PAGE | ~~$ 650~~ $325 | ~~$ 1,200~~ $600 |

**Ugadi 2026**

**Special Discount**

**50% OFF**

**ON ALL 6-ISSUE & 12-ISSUE**

## WEEKLY NEWSLETTER

| 6 MONTHS | 12 MONTHS |
|---|---|
| ~~$1,650~~ $825 | ~~$3,000~~ $1500 |

## FOR MORE DETAILS PLEASE CONTACT:


**SUNIL PANTRA**
Secretary
(248) 469 - 2349

**RAJA KASUKURTHI**
Treasurer
(201) 270 - 8648

advertisements@tana.org






శ్రీ అట్లూరి & జలపతి

# 2026 మొదటి ఆరు నెలలు... హడావిడి ఎక్కువ, విజయాలు తక్కువ

***కొత్త సంవత్సరం మొదలైనప్పుడు తెలుగు చిత్రసీమపై ఉన్న ఆశలు ఆకాశాన్ని తాకాయి. సంక్రాంతి సందడి, భారీ కథానాయకుల చిత్రాలు, పలు విభిన్న కథల ప్రకటనలు చూసి ఇది తెలుగు సినిమా మరో స్వర్ణయుగానికి నాంది అవుతుందనే భావన వ్యక్తమైంది. కానీ 6 నెలలు పూర్తయ్యేసరికి లెక్కలు మరో కథ చెప్పాయి. విడుదలల సంఖ్య వందకు చేరువైనా, ప్రేక్షకుల మనసు గెలుచుకున్న చిత్రాలు మాత్రం వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయిలోనే నిలిచాయి. భారీ ఖర్చులు పెట్టిన చిత్రాలు వరుసగా తడబడగా, తక్కువ అంచనాలతో వచ్చిన కొన్ని చిత్రాలు మాత్రమే బాక్సాఫీస్‌కు ఊరట ఇచ్చాయి. కథ బలంగా ఉంటేనే ప్రేక్షకుడు థియేటర్ వరకు వస్తాడనే విషయాన్ని ఈ ప్రథమార్థం మరోసారి స్పష్టంగా నిరూపించింది***

తెలుగు చిత్రసీమ ట్రెండ్ ఇలా సాగింది...

2026 సంవత్సరం ప్రథమార్థం టాలీవుడ్ చలన చిత్రరంగానికి ఒక సవాలుతో కూడిన ప్రయాణంగా నిలిచింది. సరికొత్త ఆశలతో, భారీ అంచనాలతో ప్రారంభమైన ఈ ఏడాది మొదటి ఆరునెలల కాలం బాక్సాఫీస్ వద్ద ఎన్నో ఎత్తుపల్లాలు చూసింది. నిన్న మొన్ననే కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నట్లు అనిపించినా, కాలం కర్పూరంలా వేగంగా కరిగిపోతూ అప్పుడే ఆరు నెలల సమయం గడిచిపోయింది. ఈ వ్యవధిలో సినిమాల సంఖ్య సెంచరీని దాటినా, విజయాలు మాత్రం వేళ్లపై లెక్కించేలానే ఉన్నాయి.

ఈ ఆరు నెలల కాలంలో ప్రేక్షకుల సినిమా వీక్షణ శైలిలో స్పష్టమైన మార్పు కనిపించింది. కేవలం భారీ వ్యయం, పేరున్న నటీనటులు, నటుల ప్రాధాన్యత ఉన్నంత మాత్రాన సినిమా హాళ్లకు జనాలు రావడం లేదనే నిజాన్ని ఫలితాలు నిరూపించాయి. ప్రేక్షకులను కూర్చోబెట్టేది కేవలం కథాబలమేనని ఈ ఆరు నెలల కాలంలో స్పష్టమైంది. మధ్యలో ఒక రెండు నెలలపాటు వసూళ్ల వద్ద సరైన సినిమాలు లేక తీవ్రమైన బాక్సాఫీస్ అలజడి ఏర్పడింది. ఈ పరిస్థితి డిస్ట్రిబ్యూటర్లను, ఎగ్జి

బిటర్లను గట్టిగా కుదిపేసింది. ఓటీటీ అలవాట్లు, సరైన ప్రచార వ్యూహాలు అనుసరించకపోవడం, ప్రేక్షకుడికి కథతో భావోద్వేగ అనుబంధం లేకపోవడం థియేటర్లు వెలవెలబోవడానికి ప్రధాన కారణాలు.

చివరికి వేసవి సెలవుల్లో సైతం తెలుగు చలనచిత్ర పరిశ్రమ నీరుగారింది. ఏప్రిల్, మే నెలల్లో చిన్న చిత్రాలు వరుస కట్టినా, ప్రేక్షకులను రప్పించే బలమైన కథా వస్తువు లేకపోవడం పెద్ద లోపంగా మారింది. అయితే ఇదే సమయంలో వైవిధ్యమైన చిన్న కథాంశాలతో, కొత్త రకమైన ఆలోచనలతో వచ్చిన కొన్ని చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. కథాబలం తోడైతే తెలుగు సినిమా వసూళ్ల సత్తా ఏ స్థాయిలో ఉంటుందో కొన్ని పెద్ద చిత్రాల ఆదాయం నిరూపించింది. మొత్తంగా చూసుకుంటే ఈ అర్ధ సంవత్సర కాలంలో తెలుగు చిత్రసీమలో శుభాల కంటే నిట్టూర్పులే ఎక్కువగా వినిపించాయి. నిష్ఠూరాలే ఎక్కువగా కనిపించాయి.

## ఆరు నెలల్లో కేవలం ఐదు విజయాలు

ఎప్పట్లానే ఈ ఏడాది ప్రథమార్థంలో తెలుగు చిత్రసీమకు సంక్రాంతి పండగ మంచి శుభారంభాన్ని ఇచ్చింది. పండగ బరిలో విడుదలైన చిత్రాలలో మన శంకరవరప్రసాద్ గారు అద్భుతమైన విజయంతో అగ్ర స్థానంలో నిలిచింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా, వెంకటేష్ అతిథి పాత్రలో వచ్చిన ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులను భారీగా ఆకట్టుకుంది. చిరంజీవి సినీప్రయాణంలోనే అత్యధిక వసూళ్లతో రూ. 300 కోట్లకు పైగా ఆదాయం రాబట్టి చిరస్థాయిగా నిలిచిపోయే ప్రాంతీయ విజయంగా రికార్డు సృష్టించింది మన శంకరవరప్రసాద్ గారు.

సంక్రాంతి రేసులో నవీన్ పొలిశెట్టి నటించిన అనగనగా ఒక రాజు మంచి విజయంగా నిలిచింది. నవీన్ తన మార్కు హాస్య చమత్కారాలతో, ఉత్సాహ పూరిత సంభాషణలతో ప్రేక్షకులను సినిమాహాళ్లలో నవ్వించాడు. పండగ సెలవులకు తగ్గ స్వచ్ఛమైన వినోదాత్మక చిత్రం కావడంతో కుటుంబాలు క్యూ కట్టాయి. ఫలితంగా ఈ చిత్రం 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి కథానాయకుడిని వంద కోట్ల క్లబ్‌లో నిలబెట్టింది.

దీనితోపాటే విడుదలైన నారీ నారీ నడుమ మురారి చిత్రం, అంతగట్టి పోటీలోనూ ఊహించని విజయంగా నిలిచింది. శర్వానంద్ నటించిన ఈ



కుటుంబ హాస్యచిత్రం పరిమిత వ్యయంతో తెరకెక్కి, జనబాహుళ్యంలో మంచి ప్రశంసలు మూటగట్టుకుంది. ఫలితంగా బాక్సాఫీస్ బరిలో సురక్షిత స్థానంలోకి వెళ్లింది.

జూన్ నెలలో విడుదలైన రామ్‌చరణ్ *పెద్ది* చిత్రం మిశ్రమ ఫలితాన్ని ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన వసూళ్ల మొత్తం పరంగా చూస్తే 2026లో ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు పొందిన చిత్రంగా నిలిచింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలవడంతో ఆంధ్రాలో లాభాలబాట పట్టింది. తెలంగాణాలో బ్రేక్ ఈవెన్ వరకు వచ్చింది. అయితే కీలకమైన అమెరికాలో, హిందీ మార్కెట్‌లో దారుణ పరాజయం చూసింది, నష్టాలు తెచ్చింది. అయితే, దాదాపు 330 కోట్ల వసూళ్లతో పెద్ది సినిమా పెద్దగా కనిపిస్తోంది.

అదేవిధంగా జూన్ మధ్యలో వచ్చిన సమంత *మా ఇంటి బంగారం* ఊహించని సంచలన విజయాన్ని అందుకుంది. నందిని రెడ్డి దర్శకత్వంలో మహిళా ప్రధాన చిత్రంగా వచ్చిన ఈ సినిమా వ్యాపార విలువపై మూడింతల లాభాలను తెచ్చిపెట్టింది. ప్రదర్శనశాలల వ్యాపారానికి మళ్లీ ఊపు తెచ్చి, కొన్న ప్రతి ఒక్కరికీ లాభాలు పంచిన ఏకైక చిత్రంగా ఇది నిలిచింది.

ఇతర భాషల నుండి అనువదించిన చిత్రాల విషయానికి వస్తే *దురంధర్ 2* అతిపెద్ద విజయంగా నిలవగా... *వీరభద్రుడు, యూత్, బ్లాస్ట్ జోన్* వంటి సినిమాలు తెలుగులో ఓ మోస్తరు విజయాలు అందుకున్నాయి. మొత్తంగా చూసుకుంటే, ఈ ఆరు నెలల్లో విజయవంతమైన చిత్రాలివే.

### ఆరు నెలల్లో పరాజయాల పరంపర

2026 ప్రథమార్థంలో పరిశ్రమకు పెద్ద షాక్ ఇచ్చిన చిత్రాలలో ప్రభాస్ నటించిన *ది రాజా సాబ్* మొదటి వరుసలో ఉంటుంది. మారుతి-ప్రభాస్ కలయికలో భారీ అంచనాల మధ్య సంక్రాంతికి వచ్చిన ఈ హారర్-కామెడీ చిత్రం తీవ్రంగా నిరాశపరిచింది. ప్రభాస్ ప్రజాదరణవల్ల ప్రారంభ వసూళ్లు భారీగా వచ్చినప్పటికీ, బలహీనమైన కథ, పేలవమైన గ్రాఫిక్స్ కారణంగా పరాజయం మూటగట్టుకుంది.



ఫిబ్రవరి, మార్చి నెలల్లో వచ్చిన చిత్రాలు పరిశ్రమను మరింత డీలా పడేలా చేశాయి. భారీ వ్యయంతో తీసిన *ఫంకీ*, *సీతా పయనం*, *యుఫోరియా* లాంటి సినిమాలు కనీసం పెట్టిన పెట్టుబడిని కూడా వెనక్కి తేలేకపోయాయి. శ్రీవిష్ణు నటించిన విష్ణు విన్యాసం విడుదలకు ముందే లాభాలు తెచ్చినా, హాళ్లలో సాధారణ ఫలితానికే పరిమితమైంది. మార్చిలో వచ్చిన *మృత్యుంజయ్* కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమిత మయింది.



ఇక ఎంతో క్రేజ్ ఉన్న పవన్ కళ్యాణ్ నటించిన *ఉస్తాద్ భగత్‌సింగ్* ఘోర పరాజయాన్ని చవిచూసింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం రొటీన్ రాజకీయ సంభాషణలు, పాత శైలి కథవల్ల పంపిణీ దారులకు భారీ నష్టాలు మిగిల్చింది. నిజానికి ఈ సినిమాకి అసలు సరైన ఓపెనింగ్ కూడా రాకపోవడం చాలా విచిత్రం. పవన్‌కళ్యాణ్, హరీష్ శంకర్ కలయికలో ఇంతకు ముందు *గబ్బర్ సింగ్* లాంటి ఘన విజయం ఉంది. అలాగే గత ఏడాది *ఓజీ* వంటి సంచలన విజయం సాధించారు పవన్‌కళ్యాణ్. రాజ కీయంగా మంచి స్థానంలో ఉన్నారు. అయినా ఈ సినిమాకి సరైన ఓపెనింగ్ రాలేదు, విడుదల తర్వాత కుప్పకూలింది. అమెరికాలో ఈ సినిమా కనీసం వన్ మిలియన్ వసూళు కూడా సాధించకపోవడం ఒక విధంగా షాక్.

వేసవి కాలంలో శర్వానంద్ క్రీడా నేపథ్యంలో చేసిన బైకర్ చిత్రానికి చప్పట్లు వచ్చినా వసూళ్లు రాలేదు. నాగశౌర్య బ్యాడ్ బాయ్ కార్తీక్ బలహీనమైన కథనం వల్ల విడుదలైన మొదటిరోజే పరాజయం పాలైంది. మే నెలలో వచ్చిన *గాయపడ్డ సింహం*, *జెట్లీ*, *గోదారి గట్టుపైనా*, *అగ్లీ స్టోరీ* వంటి చిత్రాలు ప్రేక్షకులను థియేటర్ల వైపు రప్పించలేకపోయాయి. ఇక *సింగ్ గీతం* చిత్రానికి ప్రశంసలు దక్కినా రాబడి రాలేదు.

## రాబోయే ఆరు నెలలపైనే ఆశలు

తెలుగు చిత్రసీమ 2026 మొదటి ఆరు నెలల ప్రయాణాన్ని విశ్లేషిస్తే భారీ నష్టాలు, కొన్ని అద్భుత విజయాల కలయికగా కనిపిస్తుంది. ప్రథమార్థంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూ ద్వితీయార్థంలో అయినా పరిశ్రమ పుంజుకోవాలని ట్రేడ్ ఆశిస్తోంది. రాబోయే ఆరు నెలల కాలంలో విడుదల కానున్న అత్యంత ఆసక్తికరమైన చిత్రాలపైనే పరిశ్రమ వర్గాలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు కొండంత ఆశలు పెట్టుకున్నారు. బలమైన కథలు, కొత్తదనంతో కూడిన చిత్రాలు వస్తేనే ప్రేక్షకులు సినిమాహాళ్లకు వస్తారనే పాఠాన్ని మొదటి ఆరు నెలలు నేర్పింది. మరి ద్వితీయార్థంలో రాబోయే చిత్రాలైనా వసూళ్లకు కొత్త ఊపిరి పోసి, తెలుగు చిత్రసీమకు పూర్వ వైభవాన్ని తెస్తాయని ఆశిద్దాం.

ఉత్తర అమెరికా తెలుగు సంఘము

Telugu Association of North America

A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID: 36-3060732

Our Youth are Our Heritage
Est. 1977
www.tana.org

# TANA Member Benefits








## Car Rentals

enterprise National

**Enterprise and National Car Rental**
Account # OSMBAQT| Discount upto 10% |Prioirty car rental

Budget — **Budget Car Rental:** CDP# V124932 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

AVIS — **Avis Car Rental:** CDP# T326011 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

dollar. — **Dollar Car Rental:** CDP# 3075644 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

Thrifty — **Thrifty Car Rental:** CDP# 3075647 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

## Hotel and Hospitality

HYATT HOTELS & RESORTS — **Hyatt Group:** Corporate Code 225686 | 15% Discount on all participating Hyatt Group Hotels

Enter you're the corporate code under Special Rates-Corporate or Group code.

IHG HOTELS & RESORTS — **IHG Group:** Corporate Code 787101128 | 7% Discount on all participating IHG Hotels

CHOICE GROUP GOODWILL PROJECTS — **Choice Group:** Corporate Code 00746710 5% Discount on all participating Choice Hotels Group

## Residential Services

SHERWIN WILLIAMS. — **Sherwin Williams:** Corporate Account# 7901-4243-4 Upto 60% off

MATTRESS FIRM — **Mattress Firm:** Corporate Account#13081634 Upto 65% off
Please reach out to Ashok Kolla to place order

## Automobile

DISCOUNT TIRE — **Discount Tires:** Corporate Account 63928 10% Discount on All tires Price match guaranteed.

MAVIS TIRES & BRAKES — **Mavis Tires:** Corporate Account 12956 15% Discount on Tires, Brakes & Other Services | Price match guaranteed.

jiffy lube — **Jiffy Lube:** Corporate Account 13081634 15% off oil changes

Valvoline — **Valvoline:** Corporate Account P4083246 15% off oil changes, and car services | Tax Exempt

TAKE 5 — **Take 5:** Corporate Account 172285 25% off on all services | Extra 5% off before 9 AM and afer 5PM Additional 5% off Ancillary items

NAPA AUTO PARTS — **NAPA Autoparts:** Corporate Account 18776 Upto 30% off car parts and accessories Tax Exempt